లేజర్ చికిత్స

- అత్యంత అధునాతన లేజర్ పరికరంతో చిగుళ్ల వ్యాధికి ప్రత్యేక చికిత్స.
- 7గురు స్పెషలిస్టు డాక్టర్లు కలిగిన ఏకైక సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల.
- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు వారి కుటుంబసభ్యులకు రీయంబర్స్‌మెంట్ సదుపాయం కలదు.

డాక్టర్ అబారు స్వరూపికుమారెడ్డి, M.D.S
Professor, Endodontics

కేర్ సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల

పాగతోట, నెల్లూరు. ఫోన్ : 2303300.

Licenced to Post without Prepayment (AP/VJ-16/WPP/2012-13)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

సమీక్షం

సంపుటి: 82 • సంచిక: 29 • 13-7-2012 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

Hotel D.S.R Paradise



- Fully Airconditioned
- 250 seating capacity
- L.E.D lighting
- Ample car parking

అయ్యప్పగుడి సెంటర్, నెల్లూరు.
ఫోన్ : 2354888, 2308666
సెల్: 8008256888, www.dsrparadise.com

మెత్తబడ్డ జగన్!

కాంగ్రెస్ పెద్దలతో రాజీ పడితే ఎట్లా వుంటుందనే ఆలోచన వైఎస్.జగన్‌లో మొలకెత్తిందా? జగన్ మనస్తత్వం తెలిసినవారు అటువంటి వార్తలను వూహలలో కూడా నమ్మరు. కానీ నిప్పులేనిదే పొగ రాదు. రాష్ట్రపతి ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రణబ్ ముఖర్జీకి ఓటు చేయాలని జగన్ నిర్ణయం తీసుకోవడం వెనుక ఈ ఆలోచన వుందని పరిశీలకులు గట్టిగా విశ్వసిస్తున్నారు. ప్రణబ్‌కు మద్దతు విషయంలో జగన్‌ను ఒప్పించడానికి

కొరవ 16వ పేజీలో





బిజెపి బలహీనం!

కర్ణాటకలో మళ్లీ ముఖ్యమంత్రి మారాడు. నాలుగేళ్లలో ముచ్చటగా మూడవ ముఖ్యమంత్రి. మారాడనడం కంటే మార్చారనడం సబబు. దేశంలో రోజు రోజుకీ రాజకీయ వ్యవస్థ ఎంతగా పతనమై పోతున్నదో అర్థం చేసుకోవడానికి ఇదొక ఉదాహరణ. దిన దినానికి దిగజారిపోతున్న జాతీయ పార్టీల ప్రాధాన్యతకు కూడా ఇదొక మచ్చుతునక. ఆ రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రావడానికి యడ్యూరప్ప, గాలి జనార్దనరెడ్డి కారకులు. ఆయనది ప్రజాబలం, ఈయనది ధన బలం. అయితే ఇద్దరి మధ్య పొత్తు కుదరలేదు. దానితో యడ్యూరప్ప గద్దె మీద ఒక రాత్రి సుఖంగా నిద్రపోలేని పరిస్థితి కల్పించాడు గాలి. దాదాపు 50 మంది ఎమ్మెల్యేలను కొట్టంలో పశువుల వలె తన ఇంట్లో కట్టిపడేశాడు. ప్రభుత్వం మెడలు వంచి తన వ్యాపారాలు పెంచుకొన్నాడు. నిత్య సంక్షోభాల నుంచి తన పదవి కాపాడుకోవడానికి యడ్యూరప్ప అడ్డదారులు తొక్కక తప్పలేదు. ఆ క్రమంలో అవినీతి కుంభకోణాలలో కూరుకపోయాడు. అవి న్యాయ పరిశీలనకు రావడంతో కుర్చీ వదలి పెట్టక తప్పలేదు. ఈలోగా గాలి కూడా జైలుకు వెళ్లాడు. రాష్ట్రంలో పార్టీకి యడ్యూరప్ప ఒక్కడే దిక్కైనాడు. ఆయన లేకుంటే మళ్లీ ఎన్నికలలో గెలవడం అసాధ్యమన్న అభిప్రాయంతో అధిక సంఖ్యలో ఎమ్మెల్యేలు ఆయనకు అండగా నిలబడ్డారు. ఈ బలాన్ని అడ్డుపెట్టుకొని యడ్యూరప్ప తన కీలుబొమ్మగా వుంటాడనే నమ్మకంతో అనామకుడైన సదానందగౌడకు అవకాశం ఇప్పించాడు. కానీ పగ్గాలు చేతికి రాగానే గౌడ గారికి స్వతంత్ర పోకడ అలవడింది. అది యడ్యూరప్పకు నచ్చలేదు. తాను లాగే సారా చెంబు తాడుకు అనుగుణంగా తోలు బొమ్మ వలె నడిచే వాడే కావాలి ఆయనకు. దానితో సదానందగౌడ కుర్చీ క్రింద కుంపటి వెలిగించాడు. దాన్ని ఆర్పడం బిజెపి అధిష్టానానికి అలివి కాలేదు. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ గడ్కరీ అంటే పార్టీలో ఎవరికీ భయం, భక్తి లేవు. ఆయన మాట ఎవరూ వినరు. ఫలితం గత రెండు నెలలుగా కర్ణాటకలో రాజకీయ సంక్షోభం. ఎన్ని ప్రయత్నాలు చేసినా యడ్యూరప్పను మెప్పించలేక, సదానంద గౌడను ఇంటికి సాగనంపింది బిజెపి అధిష్టానం.

అయితే ఇల్లలుకగానే పండుగ కానట్లే, ముఖ్యమంత్రి మార్పుతో పరిస్థితి కుదుట పడలేదు. అర్థాంతరంగా పదవి పోగొట్టుకొన్న సదానంద గౌడ వక్కలిగ కులాన్ని రంగంలోకి దించాడు. తమ నేతను అవమానించారని ఆ కులానికి చెందిన ఎమ్మెల్యేలంతా బిజెపి మీద తిరుగుబాటు చేస్తున్నారు. వారిని సంతృప్తి పరచాలంటే, సదానంద గౌడకు రాష్ట్ర పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వాలి. అయితే అది యడ్యూరప్పకు ఇష్టం లేదు. ఏడాది లోపల శాసనసభ ఎన్నికలున్నాయి కాబట్టి, సదానంద పార్టీ పెత్తనం చేసే స్థానంలో వుంటే, తన అనుచరులకు టిక్కెట్లు ఇప్పించుకోవడం ఇబ్బంది అవుతుందని యడ్యూరప్ప భయపడుతున్నాడు. వీరిద్దరి మధ్య ఎట్లా రాజీ కుదర్చాలో అర్థం కాక జుట్టు పీక్కొంటున్నాడు నితిన్ గడ్కరీ.

దీని అర్థం – క్రిందిస్థాయి నేతల మీద బిజెపి జాతీయ నేతలకు ఏ మాత్రం పట్టు లేదని. కర్ణాటకతో పాటు రాజస్థాన్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలలోనూ బిజెపి ఇదే దీనావస్థ ఎదుర్కొంటున్నది. గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడి అయితే, తాను పార్టీ కంటే పెద్ద అన్న ధోరణిలో వ్యవహరిస్తున్నాడు. పార్టీ గెలుపుకు విధానాలు, సిద్ధాంతాలు కాకుండా; స్థానిక నాయకత్వ బలం మీద, వారు వెదజల్లే డబ్బు మీద ఆధారపడక తప్పని దుర్గతి వల్లనే ఈ దౌర్భాగ్యం. కేంద్రస్థాయిలో బిజెపి అధికారంలోకి వస్తే తామే ప్రధాని కావాలన్న కోరికతో అరుణ్ జైట్లీ, నరేంద్రమోడి, సుష్మాస్వరాజ్, వెంకయ్య నాయుడు, నితిన్ గడ్కరీ తదితర నేతలంతా దిగువస్థాయి నేతలను రెచ్చగొడుతున్నారు. ఒకరు ఎదగకుండా మరొకరు కాళ్లు పట్టుకొని లాగుతున్నారు. దానితో పార్టీ యంత్రాంగం కుక్క చింపిన విస్తరి వలె మారిపోతున్నది. ఇదే పరిస్థితి కొనసాగితే దేశంలో జాతీయ పార్టీగా బిజెపికి గుర్తింపు సైతం మిగలక పోవచ్చు. అవినీతి కేసులను కాపాడుకోవడం కోసం, అధికార దాహం తీర్చుకోవడం కోసం బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడే రాష్ట్రస్థాయి నేతల పట్ల కఠినంగా వ్యవహరించలేక పోతే ఏ జాతీయ పార్టీకైనా ఈ దౌర్భల్యం తప్పదు.

జమీన్‌రైతు

జనవాక్కు

సుబ్బరామిరెడ్డిది మంచి మనసు!

నెల్లూరు పార్లమెంట్ స్థానానికి ఇటీవల జరిగిన ఉపఎన్నికల్లో పోటీ చేసిన తిక్కవరపు సుబ్బరామిరెడ్డిని గెలిపించకపోయినా ఆయన తనలోని మంచి మనసు చాటారు. తాను ఎన్నికల ప్రచారంలో చేసిన వాగ్దానం మేరకు నెల్లూరులో ఎఫ్.ఎం రేడియో స్టేషన్‌ను సాధించారు. కేంద్ర ప్రసారశాఖ మంత్రిణి అంబికా సోని ద్వారా ఈ మేరకు ఉత్తర్వులిప్పించారు. ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్యను పరిష్కరించిన సుబ్బరామిరెడ్డికి నెల్లూరీయులు కృతజ్ఞతలు చెప్పాలి. ఇతర సమస్యలను కుడా ఆయన నేరవేర్చినా ఆశ్చర్యపడనక్కర లేదు.

టి.కె.రెడ్డి నెల్లూరు

కాంగ్రెస్ పరిస్థితి దైన్యం!

రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ పరిస్థితి అధ్వాన్నంగా తయారయ్యింది. రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఉపఎన్నికల్లో ఆ పార్టీ కోలుకోలేని విధంగా దెబ్బతినిపోయింది. ఇదేవిధంగా పరిస్థితులు కొనసాగితే 2014 ఎన్నికల్లో పార్టీకి ఘోర పరాజయం తప్పేట్లు లేదు. ఢిల్లీ నుంచి అధిష్టానవర్గం ముఖ్యమంత్రి, పిసిసి అధ్యక్షుడిని డమ్మీలను చేసి రిమోట్ కంట్రోల్ పద్ధతిలో పాలన నడిపించడం ప్రజలు సహించలేకున్నారు. వైఎస్ హయాంలో జరిగిన అవకతవకలు కాంగ్రెస్‌కు అశనిపాతంలా మారాయి. విచిత్రంగా వైఎస్ కుమారుడు జగన్మోహన్‌రెడ్డి ఈ అవినీతికి కారకుడంటే జనం ఎందుకు జీర్ణించుకోలేకపోతున్నారో మహా విశ్లేషకులు సైతం విశ్లేషించని పరిస్థితి నేడు రాష్ట్రంలో ఉంది. మొత్తం మీద రాష్ట్రాభివృద్ధి నిలచిపోయింది.

ఎ.వెంకటేశ్వర్లు కావలి

ఆరోగ్యశ్రీ కార్డుల కలలు కల్లలేనా?

ప్రభుత్వం, ఉన్నతాధికారుల అలసత్వం కారణంగా, ఉద్యోగులకు, ఫించనుదార్లకు ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ విషయం నత్తనడకను తలపిస్తున్నది. 2011 ఉగాది నాటికే ఆరోగ్యశ్రీ కార్డులను అందజేస్తామని ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి స్వయంగా చెప్పినా, ఆ మాటకు కట్టుబడకపోవడం దురదృష్టకరం. 2013 ఉగాదికైనా ఈ కార్డులు అందుతాయో లేదో అనే అనుమానం కూడా కలుగుతున్నది. ఇప్పటికైనా ఈ వ్యవహారంలో ప్రభుత్వం చొరవ చూపితే బాగుంటుంది.

ఆశం సుధాకర్‌రావ్ గూడలి

ఇండస్ట్రియల్ ఎస్టేటుకు భూమి కేటాయించండి!

నెల్లూరు ఎకెనగర్‌లోని ఇండస్ట్రియల్ ఎస్టేటులో కొత్త పరిశ్రమలు పెట్టేందుకు ఖాళీప్లాట్లు లేవు. నగరానికి దగ్గరలో 50 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తే రెండవ ఇండస్ట్రియల్ ఎస్టేటును ఏర్పాటు చేసుకోవచ్చు. 20ఏళ్లుగా

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

17-7-1942
పేజీలు : 8 వెల: అణా

డిటిన్యూడే సభలు

నెల్లూరులో 12వ తేది ఓరుగంటి వెంకట సుబ్బయ్య అధ్యక్షతక్రిందను, ఆత్మకూరులో రామచంద్రా రెడ్డి అధ్యక్షత క్రిందను, చెన్నూరులో చిట్టంశెట్టి శేషయ్య అధ్యక్షత క్రిందను, నాయుడుపేటలో రా.వెం క్రిందను సభలు జరిపి డిటిన్యూలను యే షరత్తు లేకుండా వదలవలెనని తీర్మానించిరి.

టవున్

12వ తేది పాత విద్యార్థుల సభలో వాది మాట్లాడాడు. ప్రతివాది రాలేదు.

***

జైలు గుమ్మం నుండి వచ్చిన శంకరయ్య సన్మానసభ 14వ తేది జరిగింది.

***

పల్లెలు

కోవూరు

ఈ 20వ శతాబ్దంలో గూడా వెట్టిబండ్ల ఊడిగం పద్ధతి బతికి బద్దలై అమల్లో ఉందంటే నాగరిక వంతులమని విర్రవీగే ఇంటర్ నేషనల్ యశోవ్యాప్తి బొందిన కోవూరు రైతాంగం ఏడవాలనో, నవ్వాలనో తెలియకుంది. ఇది వరకు చావిడి మరమ్మత్తులకని బీదా బిక్కి దగ్గర రూపాయికర్ణణా వంతు వసూలుచేసిన డబ్బు సంగతి ఆనాడే ఏమయ్యా అని బొడ్లో చెయ్యేసి నిలబెట్టి అడిగే దిక్కుంటే, ఈనాడు వెట్టికి బండ్లు బంపమని అడగడానికి ఆ పెద్ద మనిషికి గుండెలుంటావా? చెప్పండి మరి!!

ఈ విషయం నేను వ్రాశానని తెలిస్తే నా ఉసురు బోసుకుంటాడు నాయనో!

50 ఏళ్ల క్రితం ఈవారం

13-7-1962
పేజీలు: 12 వెల: 0-20 న.పై

బెజవాడ గోపాలరెడ్డి ఘనత!

డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి తొలిసారిగా మద్రాసులో మంత్రిగా ప్రమాణ స్వీకారం గావించి జూలై 14కు పాతికేళ్లు నిండుతాయి. జూలై 14న గోపాలరెడ్డి గారి పార్లమెంటరీ జీవిత రజతోత్సవ దినంగా చెప్పవచ్చు. దేశంలోని వివిధ రాష్ట్రాలలో 1937లో మంత్రులుగా ఉన్న వారిలో నేడు నలుగురు మాత్రమే మంత్రులుగా ఉన్నారు. వారిలో గోపాలరెడ్డిగారొకరు. దేశ చరిత్రలో ఈ పాతిక శతాబ్ది ఉజ్వలమైనది. అనేక ముఖ్య సంఘటనలకు, మార్పులకు నెలవైనది.

నెల్లూరు మునిసిపల్ పాలన సంతృప్తికరం!

నెల్లూరు మునిసిపల్ కౌన్సిల్ గత 30వ తేది ఛైర్మన్ సొదాగర్ మహబూబ్‌ఖాన్ అధ్యక్షతన సమావేశమైంది. సమావేశం ప్రారంభంలో కౌన్సిలర్ వి.అనంతరామయ్య గారు తాము(ప్రతిపక్షం వారు) తమకు సంబంధించిన వార్డులలో కుళాయిలు, బోరింగ్ పంపులు, రోడ్లు, వీధి దీపాలు వేయవలసినదిగా కోరుతూ ప్రతిపాదించిన తీర్మానాలు అమలు జరగడం లేదని ఆరోపిస్తూ నిరసనగా తాను కౌన్సిల్ సమావేశం నుండి నిష్క్రమిస్తున్నట్లు చెప్పి వెళ్లిపోయారు. ఆయన వెంట ప్రతిపక్ష కౌన్సిలర్లు శ్రీయుతులు పి.రామకోటయ్య, వడ్డే హనుమంతరావు, గంటా ఆవులయ్య, ఎన్.కాంతారావు గారలు కూడా సభ నుండి లేచిపోయారు.

తర్వాత నెల్లూరు మునిసిపాలిటీ పరిపాలనా నివేదికపై రాష్ట్ర ప్రభుత్వం వారు జేసిన సమీక్షను, నెల్లూరు కౌన్సిల్ రికార్డు జేసింది. నెల్లూరు మునిసిపాలిటీ పరిపాలన మొత్తం మీద బాగానే ఉందని ప్రభుత్వం సంతృప్తిని ప్రకటించింది. పన్నుల వసూళ్ల కార్యక్రమాన్ని ద్విగుణీకృతంజేసి మునిసిపాలిటీ ఆదాయాన్ని పెంచాలని ప్రభుత్వం సలహా యిచ్చింది.

నెల్లూరు ముచ్చట్లు

మటన్ మరీ ప్రియమయ్యింది!

పొట్టేలు మాంసాన్ని రాష్ట్రంలో ఎక్కడాలేనంత రేటుకు నెల్లూరు కసాయిలు అమ్ముతున్నారు. కిలో మాంసం 420 రూపాయలుగా నెల్లూరు మార్కెట్‌లో ధర పలుకుతుంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలలో పలకని మాంసం ధర పొట్టేళ్లు, గొర్రెలు పెంపకం జరిగే చోట ఎందుకంటే చికెన్, చేపల ధరలు అంతగా పెరగగాలేనిది మటన్‌ను పెంచితే ఎందుకు బాధపడుతున్నారని ఎదురు ప్రశ్నిస్తున్నారు. 420 రూపాయలకు తీసుకొంటున్నా పక్కా మాంసాన్ని ఇవ్వడం లేదు. కల్తీదే ఇస్తున్నారు. కార్పొరేషన్ ఆరోగ్య శాఖాధికారులు మామూలుగా మటన్ ఇళ్లకు పట్టుకెళ్లడం కాదు నాణ్యతపై కనీసం వారానికోసారైనా మార్కెట్‌లో తనిఖీలు చేస్తే బాగుంటుంది.

రూ.27కే సన్న బియ్యం!

నెల్లూరు మార్కెట్‌లో జిలకర మసూరి రకం బియ్యం కిలో 35 రూపాయలుగా అమ్ముతున్నారు. ఇంత రేటు చెల్లిస్తున్నా ఈ బియ్యం పాతవి కావు. పొయ్యిమీద పెట్టగానే అన్నం ఉండ అయిపోతుంది. బియ్యం రేట్లు జనానికి అందుబాటులో ఉంచాలని ఇన్‌ఛార్జ్ జాయింట్ కలెక్టర్ లక్ష్మీకాంతం జిల్లా రైసు మిల్లింగ్ ఇండస్ట్రీ పెద్దలతో మాట్లాడి కిలో 27 రూపాయలకే మసూరి బియ్యం నవాబుపేట, ఫత్తేఖాన్‌పేటల్లోని రైతు బజార్లలో అమ్మే ఏర్పాట్లు చేశారు. ఏ రంగు రేషన్ కార్డు తీసుకెళ్లినా ఒక్కొక్కరికి పది కిలోల వంతున ఇస్తారు. కానీ ఇక్కడిస్తున్న బియ్యం మూడో రకంవి కావడం బాధాకరం. ఇక్కడ నాణ్యమైన బియ్యం అమ్మించండి లక్ష్మీకాంతం గారు!

లెజిస్లేచర్ పార్టీలో పదవులు!

వైఎస్ఆర్ కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ కార్యదర్శిగా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యునిగా ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిని ఎన్నుకొన్నారు. ఒక రాజకీయ పార్టీకి చెందిన శాసనసభా పార్టీ కార్యవర్గంలో జిల్లాకు చెందిన ఇద్దరికి పదవులు దక్కడం విశేషమే.

తెలుగుదేశంలో మార్పులు!

జిల్లా తెలుగుదేశం పార్టీలో కొన్ని మార్పులు జరగవచ్చుంటున్నారు. పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు బీద రవిచంద్రకు అప్పగించవచ్చట. ఇప్పటివరకు అధ్యక్షునిగా ఉన్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరోలోనికి తీసుకోవచ్చు. పొలిట్ బ్యూరోలో ఉన్నా సోమిరెడ్డి పెత్తనం లేకుండా జిల్లాలో తెలుగుదేశం పార్టీ నడవదనే చెప్పాలి.

ట్రాఫిక్‌పై దృష్టిపెట్టిన నగర ఓఎస్డీ!

నెల్లూరు నగర పోలీస్ ఓఎస్డీ నర సింహకిషోర్ జూలు విదిల్చారు. ప్రజలను ప్రతిరోజూ పద్మవ్యూహంలో చిక్కుక పోయేలా చేసే ట్రాఫిక్ సమస్యపై దృష్టి



నెల్లూరు కపాడిపాళెంలో స్పందన ఎడ్యుకేషన్ సొసైటీ నేతృత్వంలో జరిగిన దివంగత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకల్లో స్కూల్ పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మందా బాబ్జి. ప్రక్కన సొసైటీ అధ్యక్షుడు మాణిక్యరావు, కార్యదర్శి రఘునాథ్.

సారించారు. చిన్నబజారుతోపాటు ట్రంకు రోడ్డంతా కలియతిరిగి ట్రాఫిక్ సమస్య ఏర్పడడానికి కారణాలు అన్వేషిస్తున్నారు. నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో ఎస్ఐలు ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట తమ తమ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతంలో కాలినడకన తిరగమని ఆదేశించారు. ఈ ఆదేశం వల్ల కూడా ట్రాఫిక్ సమస్య కొంతలో కొంత మేర పరిష్కారమవవచ్చు. ఈ సమస్య పరిష్కారానికి ఓఎస్డీ దీర్ఘకాలిక ప్రణాళిక అమలు పర్చడమే ఉత్తమం.

వైఎస్ జయంతి వేడుకలు!

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 63వ జయంతి వేడుకలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరులో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా కలెక్టర్ బంగళా ప్రక్కన గల పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం పార్టీ జిల్లా కన్వీనర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ ఉపయోగపడ్డాయి. ఆయన మరణానంతరం ఆ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, ఎల్లసిరి గోపాలరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, కె.వి.రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్‌కోతతో నరకం!

వేళాపాళా లేకుండా అడ్డగోలుగా విధిస్తున్న విద్యుత్ కోత సమస్యను వారం రోజులలోగా పరిష్కరించాలని వైఎస్ఆర్ సిపి డిమాండ్ చేసింది. ఈ వ్యవహారమై 9వ తేది ప్రజావిజ్ఞప్తుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కలక్టరేట్‌లో డిఆర్వో రామిరెడ్డిని కలసి వినతి పత్రం అందించింది. ఈ సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ

కొరవ 14వ పేజీలో

వజ్రం - బంగారం - వెండి ఫ్యాక్టరీ అవుట్‌లెట్
BIS 916 హాల్‌మార్క్ బంగారు ఆభరణములపై* తరుగు 6% నుండి - కూలి లేదు.
వెండి వస్తువులపై* తరుగులేదు - కూలిలేదు.
డైమండ్స్‌పై 10% తగ్గింపు*
*T&C Apply
గోల్డ్ ప్యాలెస్
ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా, జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.
ఫోన్: 2331133, 2327611

సిల్వర్ ఫ్యాక్టరీ అవుట్‌లెట్
925 STERLING SILVER* EXPORT QUALITY
వెండి వస్తువులపై* తరుగు లేదు, కూలి లేదు.
*T&C Apply
సిల్వర్ ప్లాజా
EXCLUSIVE SILVER SHOW ROOM
(A Unit of Gold Palace)
ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా, జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.
ఫోన్: 2331132, 2331121

అభినందన శుభాకాంక్షలు

సహృదయుడు, కార్యదీక్షాపరుడైన నాప్రియ మిత్రుడు
శ్రీ డి. అశోక్‌కుమార్
ది నెల్లూరు డిస్ట్రిక్ట్ హోల్‌సేల్ కెమిస్ట్స్ & డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై ప్రమాణస్వీకారం చేసిన శుభసందర్భముగా వారికి ఇవే మా హృదయపూర్వక అభినందన శుభాకాంక్షలు.
శ్రీ డి. అశోక్‌కుమార్
ప్రెసిడెంట్, TNDWC & D అసోసియేషన్
ఆర్ఆర్ ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్ అభినేత.
D.KALYAN
STYLE & SLIM SALOON PARLOUR
D.R. Utthama Hotel Upstairs, Nellore.

ఉత్తరక్రియలు

న్యాయవాద వృత్తిలో విశిష్ట వ్యక్తిగా గుర్తింపుపొంది
గూడూరు సంస్కృతి సమ్మేళనం వ్యవస్థాపకులుగా
గూడూరు నేత్రదాన కమిటీ కార్యదర్శిగాను
విశిష్ట సేవలు అందించిన మనసున్న మంచి మనిషి,
మా ఇంటి దైవం శ్రీ పెళ్లేటి రాజారామిరెడ్డి గారు
తేది 03-07-2012 మంగళవారం నాడు స్వర్గస్తులైనారు.
వారి ఆత్మకు శాంతిని కలుగచేయమని భగవంతుని ప్రార్థిస్తున్నాము.
భార్య: పెళ్లేటి పద్మావతమ్మ
కుమారులు - కోడళ్లు
పెళ్లేటి శశిధర్‌రెడ్డి - సుప్రజ
లెక్చరర్, శ్రీవేణుగోపాలస్వామి డిగ్రీ కళాశాల, నెల్లూరు
పెళ్లేటి మహిధర్‌రెడ్డి - శైలజ
ఇంజనీరు, ఎలక్ట్రిసిటీబోర్డు, చెన్నై.
కీ॥శే॥ పెళ్లేటి రాజారామిరెడ్డి గారు B.A., B.L.,
న్యాయవాది, గూడూరు.
మనుమలు - మనుమరాండ్రు
పెళ్లేటి రుష్యంత్‌రెడ్డి
ఆర్. కిరణ్‌కుమార్‌రెడ్డి - దుర్గస్పందన, యస్. వెంకట ఫణిధర్‌రెడ్డి - సన్నిహిత
ముని మనుమడు: ద్రోణ్‌రెడ్డి
ఉత్తరక్రియలు: తేది 13-07-2012 శుక్రవారం "నిలుపు" తేది 14-07-2012 శనివారం "పెద్దకర్మ"
గూడూరు, పాత స్టేట్‌బ్యాంకు వీధిలోని మా గృహము నందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

టీచర్ల అక్రమ బదలీల్లో

డిఇఓ పాత్రే కీలకం!

ఎమ్మెల్సీలు విఠపు, యండవల్లి ఆరోపణ



జిల్లాలో విద్యాశాఖ భ్రష్టుపట్టడానికి, ఉపాధ్యాయుల కౌన్సిలింగ్‌లో అక్రమ బదలీలకు జిల్లా విద్యాశాఖాధికారి మువ్వా రామలింగం ప్రధాన కారణమని శాసన మండలి సభ్యుడు విఠపు బాలసుబ్రహ్మణ్యం ఆరోపించారు. కొందరు ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉత్తర్వులు తెచ్చుకొనేందుకు అవసరమైన ప్రత్యక్ష సహకారం డిఇఓ అందించారన్నారు. జిల్లాలో జరుగుతున్న టీచర్ల బదలీలపై ఆయన సహచర శాసన మండలి సభ్యుడు వై.శ్రీనివాసులురెడ్డితో కలసి తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామలింగం వ్యవహారశైలిపై విఠపు విరుచుకపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా బదలీలు జరుగుతున్నా ఎక్కడా గందరగోళం నెలకొనలేదని కేవలం డిఇఓ వ్యవహారశైలి వలన నెల్లూరులో ఉపాధ్యాయుల కౌన్సిలింగ్‌లో వ్యతిరేకత వ్యక్తమయ్యిందన్నారు. గవర్నమెంటు ఆర్డర్లు తెచ్చుకొనేందుకు లక్ష నుంచి రెండు లక్షల రూపాయలు చేతులు మారాయన్నారు. దీనికి అవసరమైన ఏర్పాట్లన్నీ డిఇఓ ఆధ్వర్యంలో జరిగాయని, ప్రభుత్వ ఉత్తర్వులు అందుకొన్నాక అర్ధరాత్రి దొడ్డిదారిన వాటిని అందజేసిన ఘనత డిఇఓ రామలింగానికే దక్కుతుందన్నారు. వాటిని అమలు చేసేందుకు తెల్లవారుజామున ఆయా మండల విద్యాశాఖాధికారులకు ఫోన్‌చేసి ఒత్తిడి చేయడంలో ఆంతర్యమేమిటని బాలసుబ్రహ్మణ్యం ప్రశ్నించారు. ఎక్కడా జరగని విధంగా అక్రమ బదలీలకు తెరతీసిన డిఇఓ రామలింగంపై చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, శాసన మండలి, న్యాయస్థానాల్లోనూ ఈ అక్రమ బదలీలపై పోరాటం చేస్తామన్నారు. పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి సభ్యుడు యండవల్లి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ విద్యాశాఖ సిబ్బందిని డిఇఓ రెచ్చగొట్టి ధర్నాలు చేయిస్తున్నాడని ఆరోపించారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.బాబురెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీహరి, పరంధామయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రక్కన సిమ్ కార్డుల అమ్మకం!

అడ్రస్ ప్రూఫ్ కూడా తీసుకోవడం లేదు

సెల్‌ఫోన్ కనెక్షన్ల వ్యవహారం గందరగోళంగా మారుతోంది. వివిధ కంపెనీల మధ్య నెలకొన్న పోటీ కారణంగా ఎక్కడికక్కడ ప్రత్యేక కౌంటర్లు పెట్టి సిమ్‌కార్డుల అమ్మకాలు జరుపుతున్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం విధించిన నియమనిబంధనలు ఖచ్చితంగా పాటించాల్సి ఉండగా బిఎస్ఎన్ఎల్ లాంటి సంస్థలు తప్ప పలు కంపెనీలు వీటిని పాటించడంలేదనేందుకు నగరంలో పలు చోట్ల జరుగుతున్న సిమ్ కార్డుల అమ్మకాలు చూస్తే అర్థమవుతుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్తగా సిమ్ కార్డు తీసుకోవాలంటే వ్యక్తిగత గుర్తింపు కార్డు తప్పనిసరి. దరఖాస్తుతోపాటు ఏదైనా గుర్తింపు కార్డును జతచేసి సంతకాలు చేసి దరఖాస్తు ఫారాన్ని పూర్తిచేయాల్సి ఉంటుంది. దీంతోపాటు ఒక ఫోటోను జత చేయాలి. వీటిని ఆయా కంపెనీల డిస్ట్రిబ్యూటర్లు పరిశీలించిన అనంతరం ఆ సిమ్ కార్డును యాక్టివేట్ చేస్తారు. అయితే ఇటీవల కొంత కాలంగా వివిధ కంపెనీలు తక్కువ ధరకు సిమ్ కార్డులను అందజేస్తూ అదనపు టాక్ టైమ్ ఇస్తామంటూ ప్రచారం చేస్తూ ఎక్కడికక్కడ సిబ్బందిని పెట్టి వీటిని అమ్మేస్తున్నారు. నగరంలో వివిధ కూడళ్లలో రోడ్డుకు ఇరువైపులా ఇలాంటి కేంద్రాలు కన్పిస్తుంటాయి. అక్కడ నిబంధనల ప్రకారం గుర్తింపు కార్డు తీసుకోవడం, దరఖాస్తులో సంతకాలు చేయడం లాంటివి ఏమీ లేకుండానే ఐదు రూపాయలకు ఒక సిమ్ కార్డు వంతున 20 రూపాయలకు నాలుగు సిమ్ కార్డుల లెక్కన అమ్ముతుండడంతో ఇవి అసాంఘిక శక్తులు, సంఘ వ్యతిరేక శక్తుల చేతుల్లోకి వెళ్తున్నట్లు సమాచారం. అలా తీసుకొన్న సిమ్ కార్డులను వినియోగించి పలువురు వ్యాపారులకు బెదిరింపు కాల్స్ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఒక వేళ దీనిపై పోలీసులు దర్యాప్తుచేసినా ఆ సిమ్ కార్డు ఎవరు వినియోగిస్తున్నారన్న విషయం రికార్డుల్లో ఉండదు. దీన్ని అవకాశంగా చేసుకొని పలువురు ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నందున జిల్లా పోలీసు అధికారులు సిమ్ కార్డుల అమ్మకాలపై తగిన దృష్టిపెట్టాలని పలువురు కోరుకొంటున్నారు.

రైతుల బాగోగులు పట్టని ప్రభుత్వం!

సోమిరెడ్డి విమర్శ

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల బాగోగులు పట్టించుకోవడం లేదని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. రైతులకు ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆ మాటే మరచిందన్నారు. టిడిపి జిల్లా కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గద్దెనెక్కేందుకు రైతులకు కల్లబొల్లి మాటలు చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాదన్నారు. ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారిందన్నారు. రోజురోజుకు తీవ్రం అవుతున్న విద్యుత్‌కోతల వలన రైతులు, పరిశ్రమల యాజమాన్యాలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నాలుగైదు గంటలపాటు కూడా విద్యుత్‌ను అందించలేక పోవడంతో పంటలు ఎండి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దీనికితోడు వరికి మద్దతు ధర లభించకపోవడంతో రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరను 222 రూపాయలకు పెంచిందని పెరిగిన వ్యవసాయ ఖర్చులతో పోలిస్తే ఈ ధర కూడా గిట్టుబాటు కాదన్నారు. రైతులు అధికంగా పండించే 'బి' గ్రేడ్ రకం ధాన్యానికి అసలు మద్దతు ధరే పెంచలేదన్నారు. అన్నిరకాల ధాన్యానికి మద్దతు ధర పెంచాలని, రాత్రిపూట విద్యుత్‌కోతలు విధించరాదని డిమాండ్ చేశారు. పెన్నా కాలువ, తెలుగుగంగ పనులు నత్తనడకన సాగుతున్నాయని దీంతో రెండో పంటకు నీరు విడుదల చేయడం లేదన్నారు. రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, ఆధునీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

క్రమబద్ధీకరణకు గడువు పొడిగింపు

జిల్లాలోని మునిసిపాలిటీ పరిధిలో అక్రమ లేఅవుట్లు క్రమబద్ధీకరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గడువు పొడిగించింది. గత సంవత్సరంలో రెండు దఫాలు క్రమబద్ధీకరణకు గడువు పొడిగించడం జరిగింది. ఈ సంవత్సరం ఒక్క దఫా మాత్రమే క్రమబద్ధీకరణ చేసుకునేందుకు అవకాశం లభించింది. అక్రమ లేఅవుట్లతోపాటు మునిసిపాల్టీ అనుమతి లేకుండా భవన నిర్మాణాలు చేపట్టిన వారు కూడా అనుమతి తీసుకునే వెసలుబాటు కల్పించనుంది. మునిసిపాల్టీలు నిర్ణయించిన ఫీజును చెల్లించి ఇంటి నిర్మాణ ప్లాన్‌కు అనుమతి పొందవచ్చు. సెప్టెంబర్ 30వ తేదిలోగా క్రమబద్ధీకరణ చేసుకోకుంటే అటువంటి లేఅవుట్లు, ఇంటి నిర్మాణాలు కూల్చివేసే అధికారం అధికారులు కలిగి ఉంటారు.

నారాయణకు సాటిలేరు!

ఎంసెట్‌లో సత్తాచాటిన విద్యార్థులు



ఎంసెట్ ర్యాంకర్లతో డాక్టర్ పొంగూరు నారాయణ.

నారాయణ విద్యా సంస్థలకు తిరుగులేదని ఎంసెట్ ఫలితాలు మరోసారి చాటాయి. నారాయణ విద్యార్థులు టాప్ వంద ర్యాంకుల్లో 51 ర్యాంకులను సొంతం చేసుకొని తమ సత్తా చాటి చెప్పారు. ఇంజనీరింగ్, మెడికల్ విభాగాల్లో అత్యుత్తమ ర్యాంకులతో నారాయణ అగ్రస్థానంలో నిలిచినట్లు విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ పి.నారాయణ వెల్లడించారు. ఇంజనీరింగ్‌లో యంపిబి మనోజ్‌కుమార్ రాష్ట్రస్థాయిలో 2 ర్యాంకు, ధీరజ్‌రెడ్డి 4 ర్యాంకు, డి.సంయుక్త 15వ ర్యాంకు సాధించారన్నారు. ఈ విభాగంలో వందలోపు 33 ర్యాంకులు నారాయణకే దక్కాయన్నారు. ఎంసెట్ మెడికల్ విభాగంలో జిఎంసివి భరద్వాజ్ రాష్ట్రస్థాయిలో 8 ర్యాంకు, బి.సనత్‌కుమార్ 14వ ర్యాంకు సాధించారు. మెడికల్ విభాగంలో వందలోపు 18 ర్యాంకులు నారాయణ విద్యార్థులు దక్కించుకున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్ శిక్షణలో నారాయణకు ప్రత్నామ్నాయంలేని విధంగా తీర్చిదిద్దామని, మెడికల్‌లోనూ అతి తక్కువ మంది విద్యార్థులతో అత్యుత్తమ విజయాలు సాధిస్తున్నామన్నారు. ఘన విజయానికి కారకులైన విద్యార్థులు, అధ్యాపకులను డాక్టర్ నారాయణ పేరు పేరునా అభినందించారు.

రాజకీయ సిఫార్సులతో రెవిన్యూ బదలీలు!

రెవిన్యూశాఖలో ఇటీవల జరిగిన బదలీల్లో రాజకీయ సిఫార్సులకే ఉన్నతాధికారులు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లను నెల రోజుల వ్యవధిలో రెండు దఫాలు బదలీలు చేశారు. రాజకీయ నేతలకు తాము ఏమీ తక్కువ కాదన్న ధోరణితో రెవిన్యూ సర్వీసు అసోసియేషన్ అధికారులు తమకు సంబంధించిన వారిని ఇష్టమైన ప్రాంతానికి బదలీ చేయించుకున్నారు. జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్‌రెడ్డి ఇటు రాజకీయ నేతలు, అటు రెవిన్యూ సర్వీసు అసోసియేషన్ నేతలు సూచించిన వారికి కోరుకొన్న చోటుకు బదలీ చేశారన్న విమర్శలున్నాయి. సిఫార్సులేని వారు మాత్రం దూర మండలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా కలెక్టర్, పౌరసరఫరాల శాఖ, తెలుగు గంగ ప్రాజెక్టు కార్యాలయాలకు ఎక్కువ మంది బదలీ చేయించుకునేందుకు పోటీపడ్డారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు తమకు అనుకూలంగా వ్యవహరించే వారిని వారి పరిధిలోని మండలాలకు తహశీల్దార్లను నియమించుకోగలిగారు. ఈ సారి జరిగిన రెవిన్యూ శాఖలో జరిగిన బదలీలు రాజకీయ రంగు పులుము కోవడం విశేషం.



విమర్శలపాలైన కలెక్టర్.

కార్యకర్తలకు అండగా ఉంటా!

గూడూరులో నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ



తమను నమ్ముకొని వున్న కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా వుంటామని మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ హామీ ఇచ్చారు. బంధువైన సత్య నారాయణరెడ్డి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించేందుకు ఇటీవల గూడూరుకు వచ్చిన ఆమె ముఖ్యకార్యకర్తలతో సమావేశం అయ్యారు. కార్యకర్తలు మనోధైర్యంతో వుండాలని, పార్టీని ముందుకు తీసుకొని పోయేందుకు కృషి చేయాలన్నారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికలలో ప్రచారం చేసిన నాయకులే పార్టీ ఓటమికి బాధ్యత వహించాలన్నారు. నాయకులు అన్నవాళ్లు కార్యకర్తల వద్దకు వెళ్లాలే తప్ప వారు నేతల వద్దకు రారన్న విషయాన్ని గ్రహించాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ఆరోగ్యం సక్రమంగా లేనందున ఉప ఎన్నికలలో తగిన ప్రచారం చేయలేకపోయామన్నారు. ప్రజలు ఒకసారి అవకాశం ఇచ్చి చూద్దామనుకొన్న కారణంగానే వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులు ఆ ఎన్నికలలో విజయం సాధించగలిగారన్నారు. 1983లోనూ ఎన్‌టిఆర్ ప్రభంజనం వలన కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలైందని, ఇక పార్టీకి మనుగడ కష్టమని అనుకొన్న తరుణంలో తర్వాత జరిగిన ఎన్నికలలో తిరిగి కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగిందన్నారు. అలాగే 1995 నుంచి 2004 వరకు తెలుగుదేశం ఏకచత్రాధిపత్యంగా పాలన సాగించినా, తర్వాతి రోజుల్లో తిరిగి కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన సంగతి గుర్తు చేశారు. ఇలాంటి ఒడిదుడుకులు కాంగ్రెస్ పార్టీకి సహజమేనని కార్యకర్తలు మనోనిబ్బరంతో ముందుకు సాగాలన్నారు. తమ కుమారుడు రామ్‌కుమార్‌రెడ్డి గూడూరు నియోజకవర్గ కార్యకర్తలతో సంబంధాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జహంగీర్ బాషా, పరిమళ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● కుందకూరు

క్వారీలను తరలించాలి!

ఆందోళన చేస్తున్న సిపిఐ

గూడూరు మండలం కుందకూరు గ్రామ సమీపంలో ఏర్పాటైన క్వారీలను వేరే చోటుకి తరలించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. గూడూరు డివిజన్ సిపిఐ నేత రాజేష్‌కుమార్ మాట్లాడుతూ క్వారీలలో జరిగే బ్లాస్టింగ్‌ల వలన గ్రామంలో నివసించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. బ్లాస్టింగ్ జరిగే సమయంలో పెద్ద పెద్ద బండలు ఎగిరొచ్చి పడుతుండడంతో ప్రాణాలకు ప్రమాదం ఏర్పడడంతోపాటు పంటలు, ఇళ్లు ధ్వంసమై పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమీపంలో నివసించే గిరిజన కుటుంబాలు దీని వలన అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని బ్రతకాల్సి వస్తోందన్నారు. తక్షణం సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని ఈ క్వారీలను మరో ప్రాంతానికి తరలించాలని, అంతవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం గూడూరు సబ్ కలెక్టర్ వీరపాండ్యన్, తహశీల్దార్ సారంగపాణిలను కలసి వినతి పత్రం అందజేశారు.

కావలి ఆసుపత్రిని తనిఖీచేసిన బీద!

సిబ్బందిపై కస్సుబుస్సు

కావలి ఏరియా ఆస్పత్రి సిబ్బంది తమ పద్ధతి మార్చుకోవాలని స్థానిక శాసనసభ్యుడు బీద మస్తాన్‌రావు హెచ్చరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన రోగులు ఆస్పత్రి సిబ్బందిపై ఫిర్యాదు చేయడంతో ఆయన ఇటీవల ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు అందించే ఆహారం పరమ నాసిరకంగా వుండడాన్ని పరిశీలించిన ఆయన హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఇంట్లో ఇలాంటి అన్నమే తింటారా? అని ప్రశ్నించారు. అదే ఆస్పత్రిలో కొత్తూరుకు చెందిన మమతకు ఆపరేషన్ చేశారు. ఆమెను వార్డుకు తెచ్చేందుకు నాలుగు వందల రూపాయలు సిబ్బంది డిమాండ్ చేస్తున్నారని బంధువులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఉడికి ఉడకని అన్నాన్ని పెడుతున్నారని చెప్పారు. దీంతో ఎమ్మెల్యే ఆగ్రహం కట్టలు తెంచుకొంది. అక్కడ వున్న ఆస్పత్రి సిబ్బందిని ఉద్దేశించి మీరు మారరా? ఇలాంటి తప్పులు చేస్తూనే వుంటారా? అంటూ మండిపడ్డారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటి చైర్మన్‌గా వున్నందున వీటికి తానే బాధ్యత వహిస్తానని అంటూ, డాక్టర్లు, సిబ్బందిపై చేస్తున్న ఫిర్యాదులపై విచారణ జరిపిస్తామన్నారు. నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించేలా చూడడంతోపాటు, లంచాలు తీసుకొనే సిబ్బందిపై చర్యలు తీసుకొనేలా అధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. విద్యుత్ కోత కారణంగా రోగులు ఇబ్బంది పడుతున్నందున వున్న జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకవచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఆస్పత్రి పనితీరు పరిశీలించేందుకు ఆత్మకూరి బ్రహ్మయ్యను నియమిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు ఆస్పత్రి తనిఖీకి రావడాన్ని తెలుసుకొన్న అవినీతి పరులైన సిబ్బంది అక్కడ నుంచి జారుకోవడం చర్చనీయాంశమయ్యింది.

పేదల పక్షపాతి వైఎస్!

కోవూరులో ప్రసన్న



పేదల పక్షపాతి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని, ఆయన చేపట్టిన ఎన్నో సంక్షేమ పథకాలు వారి జీవితాల్లో వెలుగులు నింపాయని కోవూరు శాసనసభ్యుడు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కీర్తించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని కోవూరులో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ పేద ప్రజల గుండెల్లో కొలువై వున్నాడన్నారు. ఆయన ప్రవేశపెట్టిన పథకాలు పేదలు మరచిపోలేరన్నారు. కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల బాగోగులు పట్టించుకోవడం లేదన్నారు. పెరుగుతున్న ధరలతో ప్రజలు ఇబ్బందిపడుతున్నా వాటిని నియంత్రించలేకపోతోందని, రైతుల సమస్యలు పట్టించుకొనే వారే లేకుండా పోయారన్నారు. గిట్టుబాటు ధరలేక, విద్యుత్ సరఫరా సరిగా లేక రైతులు వ్యవసాయం చేయలేక అల్లాడుతున్నారన్నారు. ఇంతగా రాష్ట్రప్రజలు వివిధ సమస్యలపై సతమతమవుతున్నా ముఖ్యమంత్రిగాని, రాష్ట్ర మంత్రులుగాని తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. అనంతరం ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ స్థానిక మైథిలి సెంటర్‌లో గల వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.

బదలీ ఉద్యోగులకు వీడ్కోలు!

సేవలను ప్రస్తుతించిన బోగోలు ఎమ్పీడిఓ.

బోగోలు మండల కార్యాలయంలో పనిచేసే పలువురు ఉద్యోగులు బదలీపై వెళ్లడంతో వారికి వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి కనకదుర్గాభవాని ఈ సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఉద్యోగి జీవితంలో బదలీ అనేది సర్వసాధారణమైనప్పటికీ అంకితభావంతో పనిచేసే సిబ్బంది బదలీ కావడం కొంత బాధాకరం అన్నారు. ఎక్కడ పనిచేసినా ప్రజలకు ఉత్తమ సేవలు అందించవలసిన బాధ్యత ఉద్యోగులందరిపైన వుందని అన్నారు. ఈ సందర్భంగా బదలీపై వెళ్తున్న గోవిందరావు, వెంకటేశ్వర్లు, నరసయ్య, మురళి, వరకుమారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు రోడ్డుకు మోక్షం

ఉప ఎన్నికలు రావడం, ఇతరత్రా కారణాలతో ఆటంకాలు ఎదురౌతున్న గూడూరు పట్టణంలోని సాయిబాబా మందిరం రోడ్డు నిర్మాణ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ ప్రాంతం నుంచి సంగం థియేటర్ వరకు వున్న రోడ్డు అధ్వాన్నంగా తయారైంది. రాళ్లుతేలి గుంటలు పడిపోవడంతో వాహనాలు నడిపేవాళ్లు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. ఏటా ప్యాచ్‌వర్కులు చేయడం చేతులు దులుపుకోవడం అధికారులకు రివాజైంది. ఈ పరిస్థితుల్లో రాష్ట్రప్రభుత్వం 1.90కోట్ల రూపాయలు మంజూరు చేసింది. టెండర్లు పిలిచారు. ఉప ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఈ

సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు

పనులకు బ్రేక్ పడింది. ఎన్నికలు ముగియడంతో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పనబాక కృష్ణయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు దెబ్బతినడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురౌతున్నాయన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో వుంచుకొని సిమెంటురోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపి నిధులు మంజూరు చేయించామన్నారు. ఎన్నికల వలన కొంత ఆలస్యమైనా త్వరితగతిన పూర్తి చేయిస్తామన్నారు. స్థానికులు కొందరు ఆయన్ను కలసి గూడూరులో టిటిడి సుదర్శన కౌంటర్ ఏర్పాటు చేయించాలని కోరగా ఆయన దీనిపై స్పందిస్తూ టిడిడి ఇఓ ఎల్వీ సుబ్రహ్మణ్యంతో మాట్లాడి త్వరలో దానిని ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు.

● పురపాలక సిబ్బందిని

ప్రజలకు పరిచయం చేశారు!

వెంకటగిరిలో సరికొత్త కార్యక్రమం

వెంకటగిరి పురపాలక సంఘపరిధిలోని వివిధ విభాగాల సిబ్బందిని ప్రజలకు పరిచయం చేసే కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. పారిశుద్ధ్యం, త్రాగునీరు, వీధిదీపాల నిర్వహణ సిబ్బంది వివరాలు, వారి ఫోన్ నెంబర్లను సంబంధిత వార్డులో తెలియజేయాలని, వారిని ప్రజలకు పరిచయం చేయాలని పురపాలక సంచాలకులు ఆదేశాలిచ్చారు. దీనికి అనుగుణంగా వెంకటగిరి పట్టణంలోని వివిధ వార్డుల్లో ఈ పరిచయ కార్యక్రమాన్ని మునిసిపల్ కమిషనర్ పుల్లారావు ప్రారంభించారు. మొదటగా 13,14 వార్డుల్లో దీనిని ఏర్పాటు చేశారు. పురపాలక అధికారులు సమస్యలు పట్టించుకోవడం లేదని వస్తున్న విమర్శలను వినూత్నంగా చేపట్టిన ఈ కార్యక్రమం దూరం చేస్తుందేమో చూడాలి.

కావలిలో ఉచిత వైద్య శిబిరం

బిఎంఆర్ ట్రస్ట్ ఔదార్యం

బిఎంఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కావలి మునిసిపల్ కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం జరిగింది. పారిశుద్ధ్య కార్మికుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని స్థానిక శాసనసభ్యుడు బీద మస్తాన్‌రావు పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిత్యం వీధులు చిమ్మడం, మురికి కాలువలు శుభ్రపరచడం తదితర పారిశుద్ధ్య పనులు చేపట్టే కార్మికులకు ఆరోగ్యం దెబ్బతింటోందని, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో వుంచుకొని ఈ వైద్య శిబిరాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామన్నారు. కావలి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు సుబ్బారావు నేతృత్వంలో వైద్య సిబ్బంది కార్మికులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, తెలుగుదేశంపార్టీ పట్టణ అధ్యక్షుడు మలిశెట్టి వెంకటేశ్వర్లు, పూనూరు రవికుమార్‌రెడ్డి, గాదంశెట్టి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



కావలి మండలం చెంచుగానిపాళెంలో సిసిరోడ్డు పనికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు. ప్రక్కన టిడిపి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.మురళీయాదవ్.



నెల్లూరు ఇందిరాభవన్‌లో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న పిసిసి కార్యదర్శి ఉడతా వెంకట్రావు, రఘురామ్, పందిళ్లపల్లి అరుణమ్మ.

దగదర్తి సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ధర్నా!

విద్యుత్ కోతలను నిరసించారు.

విద్యుత్ కోతల కారణంగా పంట ఎండిపోతుండడంతో ఆగ్రహించిన రైతులు దగదర్తి మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. మండలంలోని వివిధ ప్రాంతాల రైతులు ఈ నిరసనలో పాలుపంచుకొన్నారు. ట్రాన్స్‌కో అధికారులు ఇష్టప్రకారం విధిస్తున్న విద్యుత్ కోతల వలన వేరుశనగ పంట నీరు లేక ఎండిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సిబ్బందిని ప్రశ్నిస్తే మెయిన్ సప్లయ్ లేదని సమాధానమిస్తున్నారు తప్ప తమ గోడు వినేవాళ్లే లేకుండాపోయారన్నారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ నుండి వెళ్లే అన్ని ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయాలంటూ డిమాండ్ చేయడంతో సిబ్బంది అధికారులకు సమాచారం అందించారు. కావలి ట్రాన్స్‌కో డిఇ అంజనీకుమార్, బుచ్చి ఎడిఇ రమేష్ చౌదరి తదితరులు సబ్‌స్టేషన్ వద్దకు చేరుకొని సర్ది చెప్పడంతో రైతులు శాంతించారు.

రొయ్యల రైతుల లబోదిబో

ఆందోళనకు గురిచేస్తున్న అదనపు ఖర్చులు

రొయ్యల రైతులను రోజురోజుకు పెరుగుతున్న ఖర్చులు ఆందోళనకు గురి చేస్తున్నాయి. రొయ్యల ధరలు అమాంతంగా పడిపోవడం, విద్యుత్ కోతలు రైతాంగాన్ని తీవ్రంగా కలవరపెడుతున్నాయి. ఏడు గంటలపాటు విద్యుత్ సరఫరా ఒక ప్రహసనంగా మారింది. దీంతో వ్యయప్రయాసలకు ఓర్చి రొయ్యల సాగు చేపట్టిన రైతులు తగిన ధరలేక, పెట్టుబడులు పెరిగి విలవిల్లాడుతున్నారు. దీనికి తోడు విద్యుత్ కోత కారణంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాల్సి వస్తోంది. వేసవిలో గుంటల్లో నీళ్లు తగ్గకుండా, రొయ్యలకు కావాల్సిన ఆక్సిజన్‌ను అందించేందుకు ఏరియేటర్లు పని చేయడం చాలా అవసరం. అందుకోసం జనరేటర్ల వినియోగం తప్పనిసరి. వీటికి డిమాండ్ ఏర్పడడంతో బాడుగ రేట్లు పెంచేశారు. నెలకు 15వేల రూపాయలకు పైగా అద్దె వసూలు చేస్తున్నారట. జనరేటర్ సామర్థ్యాన్ని బట్టి గంటకు రెండు నుంచి నాలుగు లీటర్లు డీజల్ అవసరమట. విద్యుత్ సరఫరా సక్రమంగా లేని కారణంగా రొయ్యల రైతులు జనరేటర్లపై ఆధారపడాల్సి రావడంతో డీజల్, బాడుగ కలిపి తడిసి మోపెడవుతున్నాయని వాపోతున్నారు రొయ్యల సాగుదారులు.

● మొదలైన

చెరువుల మరమ్మత్తులు!

రైతుల ముఖాల్లో ఆనందం

బోగోలు మండలం తాళ్లూరు పంచాయితీలో గల పెద్ద చెరువు, చిన్న చెరువుల మరమ్మత్తు పనులు ఎట్టకేలకు ప్రారంభం అయ్యాయి. ఐదేళ్ల ముందు సంభవించిన లైలా తుఫాను కారణంగా ఈ రెండు చెరువులు దెబ్బతిన్నాయి. అప్పటి నుంచి వర్షాలు పడి చెరువుల్లో చుక్కనీరు వుండకపోతుండడంతో చెరువు ఆయకట్టు క్రింద వున్న 475 ఎకరాల్లో సాగు కష్టతరంగా మారింది. రైతులు పంటలు పండించుకొనేందుకు నానా తంటాలు పడాల్సి వస్తోంది. పార్లమెంటు సభ్యుడిగా వున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డికి దీనిపై పలుమార్లు రైతులు విన్నవించుకొన్నా ఫలితం లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో సోమశిల ప్రాజెక్టు ఛైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి రైతుల సమస్యను తీసుకపోవడంతో స్పందించిన ఆయన చెరువు మరమ్మత్తులకు నిధులు కేటాయించడంతో మరమ్మత్తు పనులు ప్రారంభం అయ్యాయి. ఈ నిధులతో చెరువులకు 75 మీటర్లు కట్టవేయడంతోపాటు తూములు, గేట్లు ఏర్పాటు చేస్తారని మధుబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు సుజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● వైఎస్ఆర్

కాంగ్రెస్ ధర్నాలు!

కావలిలో రైతు సమస్యలు ఎలుగెత్తి చాటారు

కావలి నియోజకవర్గంలోని వివిధ మండలాలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ధర్నాలతో దద్దరిల్లాయి. రైతు సమస్యలపై ఈ పార్టీ చేపట్టిన ఆందోళనలో పెద్ద ఎత్తున రైతులు పాల్గొని తమగోడు వెళ్లబోసుకొన్నారు. ప్రభుత్వం రైతులను చిన్న చూపు చూస్తోందని విమర్శించారు. ఎరువుల ధరలు పెరిగి వ్యవసాయం భారం అయ్యిందని, గిట్టుబాటు ధర లేక ఆర్థికంగా నష్టపోతున్న రైతులను విద్యుత్ కోతలు మరింత దెబ్బతీస్తున్నాయని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. బోగోలు చెరువు మరమ్మత్తులు చేపట్టాలని, ముంగమూరు బ్రిడ్జి నిర్మాణం జరపాలని, విద్యుత్ కోతలను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ తీగలపై గుడ్డలు ఆరేసి రైతులు తమ నిరసన తెలియ జేశారు. మూడు మండలాల్లో జరిగిన ఈ ధర్నాల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు బీద రమేష్, బత్తుల మోహన్ రెడ్డి, తూపిలి పెంచలయ్య తదతరులు పాల్గొన్నారు.

బాల కార్మికులను గుర్తించిన గూడూరు సబ్ కలెక్టర్!

ఐసిడిఎస్‌కు అప్పగించారు

బాలకార్మికులను గుర్తించామని, వారిని బడుల్లో చేర్పిస్తున్నామని వివిధశాఖల అధికారులు ప్రకటిస్తున్నా అవి కేవలం కంటితుడుపు చర్యలు మాత్రమేనని ఎందరో బడి బయట వున్నారనేందుకు వెంకటగిరే ఉదాహరణ. సాక్షాత్తు సబ్‌కలెక్టర్ బాల కార్మికులను గుర్తించడం విశేషం. పట్టణంలో ఓ భూవివాదాన్ని పరిష్కరించేందుకు వచ్చిన ఆయన సమీపంలోని ఇటుకబట్టీలో పని చేస్తున్న పిల్లలను గుర్తించారు. చిట్టమూరు మండలం ఈశ్వరవాక గ్రామానికి చెందిన గిరిజన కుటుంబం ఇక్కడ పని చేస్తోంది. వారి పిల్లలు ఐదుగురు అక్కడే పని చేస్తున్నారు. వీరిని గుర్తించిన సబ్‌కలెక్టర్ వీరపాండ్యన్ ఆ పిల్లలను ఐసిడిఎస్‌కు అప్పగించారు. అంతేకాకుండా ఈశ్వరవాకలో ఆ గిరిజన కుటుంబానికి రెండెకరాల భూమి కేటాయించాలని అక్కడి తహశీల్దార్‌ను ఆదేశించారు. పిల్లలతో పనులు చేయించుకొంటున్న బట్టీ యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆయన ఆదేశించారు.

బండలాగుడు పోటీలు

జలదంకి మండలం తొమ్మిదవ మైలులో గల మాతా పరమేశ్వరి తిరునాళ్లను పురస్కరించుకొని బండలాగుడు పోటీలు జరిగాయి. ఉత్సవాలను వైభవంగా నిర్వహించిన అనంతరం చివరి రోజున మండల స్థాయిలో ఈ పోటీలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి పది జతల కాడెద్దులతో రైతులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడంతో కోలాహలం నెలకొంది. జలదంకికి చెందిన దండే అనిల్‌రెడ్డికి చెందిన ఎద్దులు ప్రథమస్థానంలో నిలిచాయి. విజేతకు నగదు బహుమతిని అందజేశారు నిర్వాహకులు.

దురాక్రమణకు గురైన రైల్వే స్థలాలు!

బిట్రగుంటలో భూస్వాముల భూ దందా

ఒకరికి ఒక న్యాయం, బడాబాబులకు మరొక న్యాయం అన్న చందంగా వుంది రైల్వేశాఖ తీరు. బిట్రగుంట పరిధిలో రైల్వేశాఖకు వేలాది ఎకరాల స్థలాలు వున్నాయి. వీటిలో చాలామటుకు ఆక్రమణకు గురై వున్నాయి. బిట్రగుంటలో మూడు ఎకరాల స్థలాన్ని కొందరు భూస్వాములు ఆక్రమించుకొని ఏకంగా ప్రహరీ నిర్మించుకొని వున్నా అడిగేనాధుడే లేకుండా పోయారు. బోగోలు మండల పరిధిలోని విశ్వనాధరావుపేట పంచాయితీ కొత్తూరు గ్రామంలోని రైల్వే భూముల్లో కొందరు షుమారు 15 ఎకరాలకు పైగా స్వాధీనం చేసుకొని వ్యవసాయం చేసుకోవడమే కాక పాసుపుస్తకాలు పొంది వున్నారట. కొండ బిట్రగుంటలోను ఇదే పరిస్థితి. రైల్వే స్థలాలను మాగాణిగా మార్చినా పట్టించుకొనే వారే లేకుండా పోయారు. చిరు వ్యాపారులు రైల్వే స్థలాల్లో పొట్టకూటి కోసం బంకులు పెట్టుకొంటే ఆగమేఘాల మీద వచ్చి తొలగించే రైల్వే అధికారులు ఎకరాలకు ఎకరాలు రైల్వే భూములు అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు చెలరేగుతున్నాయి.

జమీన్‌రైతు
పాగతోట, నెల్లూరు - 524 001.
ప్రకటనలకు
98489 66163
98489 66165
చందాలకు
98489 66190

● వెంకటగిరిలో

ట్రాఫిక్ గందరగోళం!

వెంకటగిరి పట్టణంలో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. జనాభా పెరుగుతుండడం, వాహనాల వినియోగం అధికం కావడం, రోడ్లు కుంచించుకపోతుండడం, వివిధ ప్రాంతాల్లో రోడ్లపైకి అంగళ్లు వచ్చి వుండడంతో ట్రాఫిక్ చిక్కులు ఏర్పడుతున్నాయి. ఏ కార్యాలయాల వద్దకు వెళ్లినా, బ్యాంకులకు పోయినా, మార్కెట్‌కు పోయినా వాహనాలు నిలుపుకొనేందుకు తగిన స్థలాలు లేవు. గతంలో ఈ సమస్యను అధిగమించేందుకు అక్కడక్కడా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసినా ఆక్రమణదారులు వాటినీ వదిలి పెట్టక కబ్జా చేసేయడంతో పార్కింగ్ స్థలాలు లేక వాహనాలు రోడ్లపైనే అడ్డదిడ్డంగా నిలపాల్సి వస్తోంది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురౌతున్నాయి. ముఖ్యంగా మార్కెట్ వీధి, పాత బస్టాండ్ సెంటర్, క్రాస్‌రోడ్ సెంటర్, పాలకేంద్రం, బంగారుపేట, స్టేట్‌బ్యాంక్ సెంటర్‌లో ఈ సమస్య అధికంగా ఉంటోంది. నానాటికీ జటిలం అవుతున్న ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకొని పోలీస్, మునిసిపాలిటీ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుకొంటున్నారు.

దెబ్బతిన్న దగదర్తి రోడ్లు!

● భారీ వాహనాలు తిరగడమే కారణం

అసలే ధ్వంసమై అధికారులు పట్టించుకోక అస్తవ్యస్తంగా తయారైన రోడ్లు భారీ వాహనాల రాకపోకలతో మరింత ఘోరంగా మారుతున్నాయి. దగదర్తి మండలం తిరివీధిపాడు, సంగం మండలం మర్రిపాడు క్వారీల నుంచి కావలి, చెన్నూరు, దగదర్తి, సున్నపుబట్టీల మీదుగా జాతీయరహదారి విస్తరణ పనులకు కంకర తీసుకొని అధికలోడ్‌తో వాహనాలు తిరుగుతున్నాయి. ఒక్కో వాహనంలో 30టన్నులకు మించిన లోడ్‌ను తీసుకొని తిరుగుతుండడంతో అసలే దెబ్బతిని వున్న ఆర్‌అండ్‌బి రోడ్లు గుంటలు పడి రూపురేఖలు కోల్పోయాయి. దీనిపై దగదర్తి, చెన్నూరు గ్రామాలకు చెందిన ప్రజలు ఆర్‌అండ్‌బి, రవాణాశాఖ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఈ ప్రాంతంలో తిరుగుతున్న 12టిప్పర్లను అడ్డుకున్నారు. ఈ సమాచారాన్ని రవాణాశాఖ అధికారులకు తెలపడంతో వారు వచ్చి ఆ వాహనాలను సీజ్ చేసి దగదర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివిధ శాఖల అధికారులకు రోడ్లు ధ్వంసమౌతున్నాయని ఫిర్యాదు చేసినా మామూళ్లు తీసుకొని పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భారీ వాహనాల రాకపోకలపై దృష్టి సారించి రోడ్లు దెబ్బతినకుండా చూడాలని కోరుకొంటున్నారు.

పాపం... గిరిజనులు!

బోగోలు మండలంలో అధిక సంఖ్యలో వుంటున్న గిరిజనుల పరిస్థితి దయనీయంగా వుంది. ప్రభుత్వం నుంచి అందాల్సిన పలు పథకాలు వీరి దరి చేరడం లేదు. రెవెన్యూ సిబ్బంది తీరు వలన చివరకు పేదలందరికి ప్రభుత్వం అంత్యోదయ పథకం క్రింద అందించే బియ్యం అందని పరిస్థితి నెలకొనింది. ఇక వివిధ సర్టిఫికేట్ల కోసం, సమస్యలపై తహశీల్దార్ కార్యాలయానికి వెళితే వీరి సమస్యలు వినే ఓపిక, పరిష్కరించే తీరిక అధికారులకు లేకపోవడంతో అమాయకులైన గిరిజనులు కార్యాలయాల చుట్టు తిరగాల్సి వస్తోంది. మండలంలోని 16 పంచాయితీల్లో 351 గిరిజన కుటుంబాలు వున్నాయి. వీరికి అంత్యోదయ పథకం క్రింద 30 కేజీల బియ్యం ఉచితంగా ఇవ్వాల్సివుండగా, అధికారుల తీరు వల్ల పలువురు గిరిజనులకు ఇవి దక్కకుండా పోతున్నాయి. అధికారులు సర్వే జరపకుండానే మండలంలో 30 కుటుంబాలే వున్నట్లు ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో వారి వరకే బియ్యం అందుతున్నాయి. దీంతో మిగిలిన గిరిజన కుటుంబాలు ప్రభుత్వ సహాయాన్ని పొందలేని పరిస్థితి ఏర్పడింది. దీనిపై గిరిజనుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు వెంకటపతి మాట్లాడుతూ కావలి నియోజకవర్గ స్థాయిలో 1500కుపైగా చల్లాయానాదుల కుటుంబాలు వున్నాయన్నారు. మండల అధికారులు బోగోలు, అల్లూరు, దగదర్తి తదితర ప్రాంతాలలో స్వల్పసంఖ్యలో గిరిజనులు వున్నట్లు తప్పుడు లెక్కలు చూపి వారికి ప్రభుత్వం అందించే ఉచిత బియ్యం రాకుండా చేస్తున్నారని, వీరిపై తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

● బోగోలులో ధైన్యంగా బతుకుతున్నారు


బ్రాహ్మణ
వివాహ సంబంధాలకు
: సంప్రదించండి :
Ph : 0861 - 6527494
email : svsmarriagelinks@live.com

వరిగొండలో సోలార్ మోటార్లు!

● జిల్లాలో సరికొత్త ప్రయోగం




జిల్లాలో మొట్టమొదటిసారిగా తోటపల్లి గూడూరు మండలం వరిగొండ గ్రామంలోని పొలాల్లో సోలార్ మోటార్లను ప్రవేశపెట్టారు. బెంగుళూరుకు చెందిన ఎన్‌విఎస్ కంపెనీ ఈ సోలార్ మోటార్ సిస్టంను ప్రయోగాత్మకంగా చేపట్టింది. తెలుగుదేశం పార్టీ నేత, సహకార బ్యాంకు అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులరెడ్డి (చినబాబిరెడ్డి) పొలంలో వీటిని అమర్చారు. ఈ సందర్భంగా సంస్థ ఇంజనీర్ శ్రీనివాసన్ సోలార్‌మోటార్ల పనితీరును వివరించారు. యూనిట్ వ్యయాన్ని బట్టి నాబార్డు ద్వారా 50శాతం సబ్సిడీ లభిస్తుందని, బ్యాంకుల ద్వారా 40శాతం రుణం అందుతుందని, రైతు 10శాతాన్ని భరించాల్సి వుంటుందన్నారు. 10 సంవత్సరాల కంపెనీ గ్యారంటీతో అందించే ఈ సోలార్ మోటార్లను చైనా సాంకేతిక సహకారంతో రూపొందించామన్నారు. బిజెపి నేత, ఎఫ్‌సిఐ మాజీ డైరెక్టర్ దువ్వూరి రాధాకృష్ణారెడ్డి, సామంతు గోపాలరెడ్డి, జాఫర్‌సాహెబ్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ దువ్వూరు సురేంద్రరెడ్డి, కంపెనీ ప్రతినిధి శ్రీరామ్ తదితరులు ఈ మోటార్ల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతిక విధానం ద్వారా మండలంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకోనున్నాయి.



● దైవకణం ఉనికి తెలియడంతో...

విశ్వం గుట్టు రట్టవుతుంది!



అన్ని శాస్త్రాలలోకి పురాతనమైనది ఖగోళ శాస్త్రం. మానవుడి పుట్టిలో మెదడనేది పుట్టగానే చేసిన మొదటి ఆలోచన – తన చుట్టూ వున్నదేమిటన్న పరిశీలన. భూమి, ఆకాశం, సూర్యుడు, నక్షత్రాలు, నదులు, సముద్రాలు, నిప్పు, వాన, ఎండా వంటివన్నీ మనిషికి అర్థం కాని ప్రశ్నలు. వాటికి సమాధానాలు వెతకడమే ఖగోళ శాస్త్రం. మనం నివసించే భూమితోపాటు, మన కంటికి కన్పించనిదేదో మన నెత్తి మీద, కాళ్ల క్రింద తిరుగాడుతున్నదన్న జ్ఞానం ఎన్నో ఏళ్ల క్రితమే కల్గింది. దానికి విశ్వం అని పేరు పెట్టుకొన్నాడు మనిషి. విశ్వం అంటే, పాల పుంత. సూర్యుడు, నవ గ్రహాలు, వాటి ఉపగ్రహాలు, కోట్లాది నక్షత్రాలు, తోక చుక్కలు వంటివన్నీ కలిస్తే పాలపుంత అవుతుంది. విశ్వంలో ఇటువంటి పాలపుంతలు కొన్ని కోట్ల సంఖ్యలో వున్నాయి. భూమి అనేది ఒక గుండు సూది మొన అయితే, సూర్యుడు ఫుట్‌బాల్ వంటివాడు. పాలపుంత ఆ ఫుట్‌బాల్ మైదానం వంటిది. దాన్నిబట్టి విశ్వ పరిమాణం ఎంత ఊహకు అందనిదో అర్థం చేసుకోవచ్చు. దాని పరిమాణమే అంతుచిక్కకపోతే, ఇక దాని పుట్టుక, వ్యాప్తి ఎట్లా బోధపరచుకోవాలి. కొన్ని వేల సంవత్సరాలుగా ఖగోళ శాస్త్రవేత్తలు ఈ విషయంలో తలలు బ్రద్దలు కొట్టుకొంటూనే వున్నారు.

కాలచక్రం చెప్పిన భారతీయుడు!

భారతదేశానికి చెందిన తొలి ఖగోళ శాస్త్రజ్ఞుడు "లగధ". ఆయన 3500 సంవత్సరాల క్రితం "వేదాంగ జ్యోతిష" అనే పుస్తకం వ్రాశాడు. ఏ టెలిస్కోప్‌లు, కంప్యూటర్లు లేని రోజులలో కేవలం కంటి చూపుతో విశ్వాన్ని దర్శించి, గ్రహాల ఉనికి కనిపెట్టి, వాటి గమనాన్ని అర్థం చేసుకొని, కాల చక్రాన్ని వివరించి చెప్పాడు. ఈ రోజుకీ మన పంచాంగం దీని ఆధారంగానే నడుస్తున్నది.

ఆర్యభట్ట ఎంతో చెప్పాడు!

పదిహేను వందలేళ్ల క్రితం పుట్టిన ఆర్యభట్ట ఖగోళ శాస్త్రానికి ఒక సమగ్ర రూపం సంతరించి పెట్టాడు. భూమి చుట్టుకొలత 24480 మైళ్లుగా వుంటుందని; భూమి సూర్యుడి చుట్టూ, చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతున్నారని; భూమి అనేది పాలపుంతలో ఒక చిన్న బిందువు వంటిదని శాస్త్రీయంగా నిరూపించిన మొదటి శాస్త్రవేత్త ఆయనే. ఆ తర్వాతే యావత్ ప్రపంచం భూమి పుట్టుక, మనుగడల గురించి తన నమ్మకాలను మార్చుకొన్నది. ఆర్యభట్ట మహా గొప్ప గణిత శాస్త్రవేత్త కూడా. సున్నా సృష్టించింది; ఆల్జీబ్రా, ట్రిగ్నామెట్రీ వంటి గణిత శాస్త్రాలను రూపొందించింది ఆయనే. ఆ తర్వాత బ్రహ్మగుప్త, భాస్కర, మాధవ వంటి ఖగోళ శాస్త్రవేత్తలు పాలపుంత రహస్యాలను ఛేదించడానికి ఎంతో మేధస్సు ప్రదర్శించారు.

అయితే వీరంతా విశ్వం ఉనికిని కనిపెట్టగలిగారు కానీ, దాని పుట్టుకను వూహించలేకపోయారు. విశ్వం సృష్టికర్త భగవంతుడనే సిద్ధాంతాన్ని నమ్మారు. పలు గ్రీకు, రోమన్ తత్వవేత్తలు ఈ సిద్ధాంతాన్ని అంగీకరించకపోయినా, ఆధునిక భౌగోళిక శాస్త్రం అభివృద్ధి చెందే వరకు విశ్వం భగవంతుడి సృష్టి అన్న నానుడే స్థిరపడిపోయింది.

ఆధునిక కాలంలో ఎడ్విన్ హబ్బెల్స్ అనే అమెరికన్ శాస్త్రవేత్త మొదటిసారిగా విశ్వం అనేది నిత్యం విస్తరిస్తూనే వుంటుందనే సత్యాన్ని వెల్లడి చేశాడు. పాలపుంత కంటే ఆవల కూడా విశ్వం విస్తరించి వుందని నిరూపించాడు. దానితో విశ్వం ఆవిర్భావం మీద శాస్త్రవేత్తలలో మరింత మథనం మొదలైంది. దానిలో నుంచి పుట్టిందే – బిగ్ బ్యాంగ్ సిద్ధాంతం.

విశ్వం పుట్టి 1375 కోట్ల సంవత్సరాలు!

విశ్వం పుట్టుక 1375 కోట్ల సంవత్సరాల క్రితం జరిగి వుంటుందని శాస్త్రవేత్తల అంచనా. విశ్వం విస్తరిస్తూ, దానిలోని పాల పుంతలు దూరం దూరంగా జరిగిపోతూ వున్నాయని హబ్బెల్స్ నిరూపించాడు. అంటే, దానికంటే ముందు ఈ పాల పుంతలన్నీ ఒకదానికొకటి దగ్గరగా వుండి వుండాలి. ఏదో ఒక శుభ ముహూర్తంలో విశ్వం విస్తరణ మొదలై, వీటిలో కదలిక జరిగి వుండాలి. ఆ ముహూర్తమే బిగ్ బ్యాంగ్.

అణువే మూలం

విశ్వం ఒక పదార్థం. అది భూమి అయినా, నక్షత్రమైనా, గ్రహమైనా, నిప్పు అయినా, నీరైనా, కొండ అయినా, మట్టి అయినా, మనిషి శరీరమైనా, చందమామ ధూళి అయినా పదార్థ సమ్మేళనమే. పదార్థం అంటే, అణువుల కూడిక. మనకు తెలిసిన అత్యంత సూక్ష్మ పదార్థం అణువు. అయితే దాని కంటే సూక్ష్మమైనది – కణం. అవి మూడు రకాలు. ప్రోటాన్, ఎలక్ట్రాన్, న్యూట్రాన్. ప్రోటాన్, న్యూట్రాన్‌లు కలిసి వుంటాయి. ఎలక్ట్రాన్‌లు ఆ కలయిక చుట్టూ తిరుగుతుంటాయి. అణువు ఒక తాబేలు వంటిదైతే, ప్రోటాన్, న్యూట్రాన్లు దాని ఆవయవాలు. ఎలక్ట్రాన్ అనేది దాని పైనుండే చిప్ప వంటిది. ఎలక్ట్రాన్ పరిభ్రమణంలో "ఫోటాన్" అనే కాంతి పుంజం పుడుతుంది. అది, అణువు తన చుట్టూ వుండే శక్తిని తనలో ఇముడ్చుకొనే ప్రక్రియను ప్రేరేపిస్తున్నది.

విశ్వంలో విస్ఫోటనం!

1375 కోట్ల సంవత్సరాల క్రితం కొన్ని కోట్ల కోట్ల కోట్ల కోట్ల కణాలు ఒకేసారి ఒక దాని కొకటి ఊహకందని వేగంతో ఢీకొనడం వల్ల, అత్యంత శక్తివంతమైన అణుబాంబు వంటి పేలుడు సంభవించి, ఈ విశ్వం పుట్టుక జరిగిందన్నది శాస్త్రవేత్తల సిద్ధాంతం. అప్పటి వరకు రోదసీలో భరించరాని వేడి వుండేది. ఆ వేడికి అణువులు, కణాలు ఒక చోట స్థిరంగా వుండక, అత్యంత వేగంతో చక్కర్లు కొడుతుండేవి. వీటి మధ్య విస్ఫోటనం జరిగిన తర్వాత కణాలు, అణువులుగా; అణువులు పదార్థంగా ఏర్పడడం ప్రారంభించాయి. ఆ విస్ఫోటనం వల్ల పుట్టిన వేడి చల్లారడానికి కొన్ని కోట్ల సంవత్సరాలు పట్టింది. ఆ తర్వాత గడ్డకట్టుకొని పోయే మంచు ముద్ద వలె తయారైంది విశ్వం. కాలక్రమంలో సూర్యుడు, గ్రహాలు, వాటి కలయికతో పాలపుంత ఏర్పడిన తర్వాత ఆ మంచు కరిగి, ఇప్పుడు మనం చూస్తున్న భూమి అనే గ్రహం ఏర్పడింది. మరికొన్ని కోట్ల సంవత్సరాల తర్వాత ఈ భూమి మీద ప్రాణులు పుట్టుకొచ్చారు. నదులు, సముద్రాలు, కొండలు, మైదానాలు ఏర్పడ్డాయి... ఇదీ భౌతిక శాస్త్రవేత్తలు వూహించే విశ్వ ఆవిర్భావ క్రమం.


దైవకణంపై పరిశోధన

అయితే స్థిరత్వం లేని కాంతిపుంజాల వంటి ఫోటాన్లను, స్థిరంగా వుంటూ శక్తిని ఇముడ్చుకొనే ప్రోటాన్, న్యూట్రాన్‌లను ఒక పదార్థంగా మార్చిన శక్తి ఏమిటి, ఎట్లా వచ్చింది అన్నది శాస్త్రవేత్తలకు ఎన్నో ఏళ్లుగా అంతుచిక్కలేదు. అణువులోని కణాలతో కూడిన పదార్థం ఏమిటో తెలియలేదు కాబట్టి, దానికి దైవ కణం అనే పేరుపెట్టారు. అంటే, శాస్త్రవేత్తలు కూడా దాన్ని భగవంతుడి సృష్టిగా తప్ప భౌతిక శాస్త్రం ప్రకారం వివరణ ఇవ్వలేక పోయారన్నమాట. ఆ పదార్థం నుంచి విశ్వం అనేది పుట్టింది కాబట్టి విశ్వం సృష్టికర్త భగవంతుడు మాత్రమే అని చెప్పే ఆధ్యాత్మిక వాదులదే ఇంత కాలం పై చెయ్యిగా వుంది. అరిస్టాటిల్ నుంచి కొన్ని వేల సంవత్సరాలుగా ఎందరో తత్వవేత్తలు సైతం ఈ తర్కాన్ని పరిష్కరించలేకపోయారు. విశ్వాన్ని భగవంతుడు సృష్టిస్తే, ఆ భగవంతుడు ఎక్కడ నుంచి వచ్చాడన్నది ప్రశ్న. ఇదొక అనంతమైన తర్కం. బిగ్ బ్యాంగ్‌తో విశ్వం పుట్టిందనుకొంటే, అప్పటి వరకు లేని పదార్థం ఎక్కడ నుంచి వచ్చిందన్నది ప్రశ్న. అణువు పుట్టుకకు కారణమైన కణాలు స్థిరత్వం లేకుండా చక్కర్లు కొట్టేవే తప్ప ఒక పదార్థంగా నిలిచేవి కావు. ఈ పదార్థం అనేది ఎట్లా పుట్టింది అనేది అర్థం కాలేదు కాబట్టి, దాన్ని దైవ కణం అనక తప్పలేదు శాస్త్రవేత్తలకు.

శాస్త్రాన్ని నమ్మే వాడికి దేముడు సృష్టికర్త అని ఒప్పుకోవడం మనస్కరించదు. దానితో ఆ ప్రశ్నకు ఎన్నో ఏళ్లుగా శాస్త్రవేత్తలు సమాధానాలు వెతుకుతూ వున్నారు. ప్రఖ్యాత శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్‌ను వేధించింది ఈ ప్రశ్న. 1988లో ఆయన వ్రాసిన బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్ అనే ప్రఖ్యాత పుస్తకంలో, విశ్వ ఆవిర్భావానికి దైవ కణమే కారణమని పేర్కొన్నాడు. ఈ దైవ కణం అనే పదార్థాన్ని మొదటగా వూహించినవాడు – పీటర్ హిగ్స్ అనే శాస్త్రవేత్త. దానికి మూలం – సత్యేంద్రనాథ్ బోస్ అనే భారతీయ శాస్త్రవేత్త ప్రతిపాదించిన సిద్ధాంతం. ఆ


కొరవ 14వ పేజీలో

కార్టూన్ స్పేస్



ఏ బాట.. కనిపించడం లేదు సార్!
ఈ ప్రోగ్రామ్ వర్షాకాలం తర్వాత పెట్టుకుంటే బెటరేమో!?





ఇడ్లీ పది, బోండా ఆరు రూపాయలు


ఇటు క్లాస్ అటు మాస్ జనం కలసి బతికే నగరం నెల్లూరు. ఇక్కడ అన్ని పంటలు పండడంతోపాటు కూరగాయలు సాగవ్వడం మూలంగా నిత్యావసర వస్తువులు, తినుబండారాల ధరలు కాస్త అందుబాటులో ఉండేవి. కానీ ఇటీవల ఎవరిష్టం వచ్చినట్లు వాళ్లు ఏదో ఒక సాకు చెప్పి రేట్లు పెంచేయడం సామాన్యులు భరించలేక పోతున్నారు. నెల్లూరీయులు టిఫిన్లు ప్రీతిగా తినే ట్రంకురోడ్డులోని వెంకటరమణా హోటల్‌లో ఒక్క సాంబారు ఇడ్లీ ధర పది రూపాయలయ్యింది. జొన్నలగడ్డ వారివీధిలో కారం దోసెలమ్మే చిన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో ఇడ్లీకు తోడుగా బోండా ఆరు రూపాయలుగా అమ్ముతున్నారు. వెజిటేరియన్ హోటళ్ల పార్శిల్ భోజనం 117 రూపాయలు, నాన్ వెజిటేరియన్ హోటళ్లలో డిష్ ఏమీ లేకుండానే పార్శిల్ భోజనం 130 రూపాయలయ్యింది. ట్రంకురోడ్డులో వీరిలా రేట్లు పెంచేస్తున్నా కోటమిట్ట, మన్సూర్‌నగర్, జెండావీధి, పొదలకూరురోడ్డు, వెంకటేశ్వరపురం, రంగనాయకులపేటలలో మాత్రం ఒకటిన్నర రూపాయలకు ఇడ్లీ, రూపాయకు బోండా దొరకడంతో ఆ ప్రాంతీయులు ఇబ్బంది లేకుండా టిఫిన్ తిన గలుగుతున్నారు.

దారికి రాని సిబ్బంది




వైద్య ఆరోగ్య శాఖను గాడిలో పెట్టేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎంత ప్రయత్నిస్తున్నా వారు తమ ధోరణి మార్చుకోవడం లేదు. మహాముదుర్లు అయిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే సిబ్బంది డ్యూటీలకు వెళ్లకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం గగనకుసుమమయ్యింది. 104 సిబ్బంది కూడా పిహెచ్‌సి సిబ్బంది బాటలోనే నడుస్తున్నారు. డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ మాశిలామణి తనిఖీలు చేసి మెమోలిస్తే వాటిని ప్రజాప్రతినిధుల దగ్గరకు తీసుకెళ్లి వాళ్లతో ఫోన్లు చేయించి ఆయననే చీవాట్లు పెట్టిస్తున్నారు. డిఅండ్‌హెచ్‌ఓకు తెలియకుండానే కార్యాలయ సిబ్బంది ఇష్ట మొచ్చినట్లు నడుస్తున్నారు. మొత్తం మీద వైద్య ఆరోగ్య శాఖలో గందరగోళం నెలకొని ఉంది.

గుడ్డు చిద్విలాసం



సండే యా మండే కభీఖావో అండే(గుడ్లు) తినమని టీవీల్లో నెక్ సంస్థ ప్రకటన చూసి సరిపెట్టుకోవాల్సిన రోజులు దాపురించాయి. నెల్లూరు మార్కెట్‌లో చిల్లరగా కోడి గుడ్డు ధర నాలుగు రూపాయలయ్యింది. అంటే డజను కోడిగుడ్లు 48 రూపాయలన్నమాట. కోడిగుడ్లు రేటు చరిత్రలో ఇది ఆల్ టైం హై అనుకొంటుంటే విక్రేతలు మాత్రం ఆగష్టు నెలలో ఈ ధర ఐదు రూపాయలవుతుందంటున్నారు. గుడ్డు పెట్టే కోళ్లు లేకుండా పోవడమే రేటు పెరగడానికి కారణమని విశ్లేషిస్తున్నారు. ఇక మనమేమి మాట్లాడగలం.

గందరగోళం గురువులు



కుక్కతోక వంకర తీయడం ఎంత కష్టమో నెల్లూరులో విద్యాశాఖను సంస్కరించడం అంతకన్నా కష్టమనాలి. ఎప్పుడు ఉపాధ్యాయుల బదలీల కౌన్సిలింగ్ జరిగినా రచ్చలు రావిళ్లే. జాబితాల్లో తప్పులు దొర్లడం, వాటిని సరిచేయకపోవడం, కౌన్సిలింగ్ మొదలు పెట్టడం, దీన్ని భరించలేని ఉపాధ్యాయులు డిఇఓలనే తన్నపోవడం చర్వితచరణమవుతున్నాయి. భావి భారత పౌరులను తయారు చేయాల్సిన గురువుల్లో సహనం తగ్గిపోతుంది. వీరిని సంస్కరించాల్సిన డిఇఓలు మరీ గలీజుగా ఉండడంతో విద్యావ్యవస్థ భ్రష్టుపట్టి పోతుంది.

ఇన్వర్టర్లకు యమ డిమాండ్



రుతుపవనాలు ఎక్కడికి వచ్చాయో... ఏటు పోయాయో వాతావరణ శాఖాధికారులకెరుక. నెల్లూరులో మాత్రం ఎండ దంచికొడుతుంది. దీనికితోడు వేళాపాళాలేని విద్యుత్‌కోతలు జనం ప్రాణం పోయేలా చేస్తున్నాయి. దీంతో ప్రాణాంతక వినియోగం కోసం దాచిపెట్టుకొన్న డబ్బులను జనం ఇన్వర్టర్ల కొనుగోలు కోసం బయటకు తీస్తున్నారు. మార్కెట్‌లో ఏవి మంచివో, ఏవి నాలుగు రోజులు మాత్రం పనిచేస్తాయో తెలియని వాటిని కొనను జనం బారులు తీరుతున్నారు. ఇదే అవకాశమంటూ వీటి అమ్మకందారులు రేట్లు పెంచేయడంతో లబోదిబోమంటున్నారు.



కోవూరు మైథిలీ సెంటర్‌లో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి రైతు సమస్యలపై వినతిపత్రం అందిస్తున్న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి.



కావలిలో దివంగత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 63వ జయంతిని పురస్కరించుకొని రక్తదానం చేస్తున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి.



వైఎస్ జయంతిని పురస్కరించుకొని ముత్తుకూరులో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, పేర్నేటి శ్యాంప్రసాద్‌రెడ్డి.



దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 63వ జయంతిని పురస్కరించుకొని నెల్లూరు హరనాథపురంలోని ట్రస్ట్ కార్యాలయంలో వస్త్రదానం చేస్తున్న అబ్దుల్ అజీజ్, ఆయన సోదరుడు అబ్దుల్ జలీల్.

వారఫలాలు

తేది 14-07-2012 నుండి 20-07-2012 వరకు వృషభంలో గురు, శుక్ర, కేతువులు; మిథునంలో రవి 16తేది వరకు తదుపరి కర్కాటకంలో; కర్కాటకంలో బుధుడు; కన్యలో కుజ, శనులు; వృశ్చికంలో రాహువు; మేష, వృషభ, మిథున, కర్కాటకాలలో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

14తేది కామికా ఏకాదశి – ఆది కృత్తిక.
16తేది దక్షిణాయనం ప్రారంభం.
కర్కాటక సంక్రమణం
18తేది చౌడేశ్వరి జయంతి.
21తేది రంజాన్ నెల ప్రారంభం.

శుభ ముహూర్తాలు

21తేది వివాహ, నూతన వ్యాపార ఆరంభాలకు సుముహూర్తాలున్నాయి.

జూలై తిథులు

ఆషాడ బహుళ

14	శని	ఏకాదశి	రా	03.44 గం.ల.వ
15	ఆది	ద్వాదశి		పూర్తిగా
16	సోమ	ద్వాదశి	ఉ	05.59 గం.ల.వ
17	మంగళ	త్రయోదశి	ఉ	07.48 గం.ల.వ
18	బుధ	చతుర్దశి	ఉ	09.06 గం.ల.వ
19	గురు	అమావాస్య	రా	09.02 గం.ల.వ

శ్రావణ శుద్ధ

20	శుక్ర	పాడ్యమి	ప	10.06 గం.ల.వ

అక్కరాజు బాలసుబ్రహ్మణ్యం
7/34, దొడ్ల సుబ్బారెడ్డి నగర్, నవలాకులతోట, నెల్లూరు – 2. సెల్: 95819 76599.

మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

తలపెట్టిన పనులన్నీ విజయవంతమౌతాయి. అన్నింటా విజయం మీదే. కుటుంబంలో సుఖసంతోషాలుంటాయి. వృత్తి, వ్యాపారాలు బాగుంటాయి. ఉద్యోగులకు ప్రమోషన్లతో కూడిన బదలీలుం టాయి. ఆర్థికంగా బాగుంటుంది. వివాహాది శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన పరిచయాల వల్ల లాభాలు, స్థిరమైన అభివృద్ధి, కోర్టు వ్యవహారాలలో అనుకూలత వుంటుంది.

వృషభం
కృత్తిక 2,3,4 పా, రోహిణి, మృగశిర 1,2 పా

గతవారం కన్నా బాగుంటుంది. వృత్తి, వ్యాపార రంగాలలో ఆర్థిక లావాదేవీలు సంతృప్తినిస్తాయి. శుభకార్య ప్రయత్నాలు ఫలించ టంతో మానసిక స్థైర్యం లభిస్తుంది. ఉద్యోగులు బదలీల విషయమై పై అధికారులను కలుస్తారు. వ్యవసాయ రంగంలోని వారికి కొంత అనుకూలం. కళా, క్రీడా రంగాలలోని వారికి కుటుంబ సౌఖ్యం, సంతాన సౌఖ్యం, శత్రుజయం వుంటాయి.

మిథునం
మృగశిర 3,4 పా, ఆర్ద్రపునర్వసు 1,2,3 పా

గ్రహసంచార అనుకూలత వల్ల ఈ రాశి వారికి అనుకూలంగా వుం టుంది. ధనాదాయం, వ్యవహార విజయం, నూతన కార్యలాభం. శుభకార్య యత్నాలు సంతృప్తినిస్తాయి. ఉద్యోగులు బదలీల విష యమై సంతోషవార్తలు వింటారు. నూతన స్త్రీ పరిచయాలుం టాయి. విద్యార్థులకు బాగుంటుంది. వ్యవసాయ, కళా, క్రీడా రంగాల లోని వారికి అనుకూలం. రాజకీయులకు సంఘంలో ఉన్నతస్థితి.

కర్కాటకం
పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష

పనులలో ఆలస్యం లేదా వాయిదా పడటం జరుగుతుంది. బంధు మిత్రులతో సఖ్యత పాటించవలెను. వృత్తి, వ్యాపారాలు సామా న్యంగా వుంటాయి. ఉద్యోగులకు బదలీలలో అనుకూలతలున్నా ఆదాయానికి మించిన ఖర్చులు, ఊహించని సంఘటనలుంటాయి. విద్యార్థులకు అననుకూలం. వ్యవసాయ రంగంలోని వారికి ఆదా యానికి మించిన ఖర్చులుంటాయి. రాజకీయులకు అననుకూలం.

సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

వృత్తి, వ్యాపార రంగాలలోని వారికి ఆర్థికాదాయం బాగుంటుంది. శుభకార్య యత్నాలకు ఇబ్బందులుండవు. కుటుంబ సౌఖ్యం, ధన లాభం, కోర్టు వ్యవహారాలలో విజయం వుంటాయి. వ్యవసాయ దారులు చిక్కులు తొలగి పనులపై శ్రద్ధ చూపుతారు. కళా, క్రీడా రంగాలలోని వారికి సంఘంలో ఉన్నతస్థితి. ఉద్యోగులకు అను కూల బదలీలు. స్త్రీ సౌఖ్యం, స్పెక్యులేషన్ లాభిస్తుంది.

కన్య
ఉత్తర 2,3,4పా, హస్త, చిత్తా 1, 2 పా

ఈ రాశి వారికి అన్నింటా విజయం. వృత్తి, వ్యాపార, ఉద్యోగాల లోని వారికి ఆదాయం బాగుంటుంది. మీ మాటకు విలువ, గౌర వం లభిస్తుంది. వివాహాది శుభకార్యాలు, నూతన గృహ నిర్మాణాది పనులు కలసి వస్తాయి. విద్యార్థులు సంతృప్తి పొందగలరు. వ్యవ సాయ రంగంలోని వారికి ఇబ్బందులు తొలగి పనులు వేగవంతమౌ తాయి. కళా, క్రీడా, రాజకీయాలలోని వారికి అన్నింటా విజయం.

తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

పనులలో కొంత విజయం సాధించినా మరికొన్ని వాయిదా పడ తాయి. వృత్తి, వ్యాపారాలలోని వారికి ఆర్థికాదాయం తగ్గుతుంది. ఉద్యోగులకు బదలీలు, ప్రమోషన్లపై కొంత వూరట లభిస్తుంది. విద్యార్థులు జాగ్రత్తగా వుండడం మంచిది. వ్యవసాయదారులకు సామాన్య ఫలితాలున్నా, ఆర్థికంగా నిలకడ వుండదు. రాజకీయాల లోని వారికి వ్యవహారాలు అంతగా అనుకూలించవు.

వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

తలపెట్టిన పనులలో సామాన్య ఫలితాలుంటాయి. వృత్తి, వ్యాపారా లలోని వారికి ఆర్థిక ఇబ్బందులుంటాయి. శుభకార్య యత్నాలు ఫలిస్తాయి. ఖర్చులధికం. ఉద్యోగుల బదలీల ప్రయత్నాలు ఫలి స్తాయి. విద్యార్థులు ఉన్నత ఫలితాలు సాధిస్తారు. వ్యవసాయ రంగంలోని వారికి అనుకూలతలుంటాయి. భార్యాభర్తల మధ్య పొరపొచ్చాలు ఏర్పడవచ్చు. రుణాలు చేయవలసి రావచ్చు.

ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

పనులలో ఆటంకాలు, మనస్సు ప్రశాంతత వుండదు. వృత్తి, వ్యాపా రాలలోని వారు మనోధైర్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారు. శుభకార్య యత్నాలు చురుకుగా సాగుతాయి. వ్యవసాయదారు లకు ఆర్థిక పరిస్థితుల వల్ల పనులు నిదానంగా సాగుతాయి. కళా, క్రీడా రంగాలలోని వారికి వృత్తి, ఆదాయాలు బాగుంటాయి. రాజ కీయ రంగంలోని వారికి ఆర్థికంగా బాగుంటుంది.

మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

ఈ రాశి వారికి పనులలో రాణింపు, వ్యవహార విజయం, ధనలాభం వుంటాయి. శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి, వ్యాపారాల లోని వారికి ఆర్థికాదాయం, ఉద్యోగులకు ప్రమోషన్లతో కూడిన బదలీలు వుంటాయి. వ్యవసాయ రంగంలోని వారికి ఇబ్బందులు తొలగి పనులు వేగవంతమౌతాయి. కళా, క్రీడా రంగాలలోని వారికి ఆర్థికపురోగతి వుంటుంది. రాజకీయులకు అననుకూలం.

కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

తలపెట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. వివాహాది శుభకా ర్యాలు జరుగుతాయి. అధిక ధనవ్యయం. వృత్తి, వ్యాపార లావాదేవీ లలో ఇబ్బందులుంటాయి. ఉద్యోగులకుపై అధికారుల అనుకూలత లుంటాయి. వ్యవసాయదారులకు అధిక ధనవ్యయం. కళా, క్రీడా రంగాలలోని వారికి ఆర్థిక, కుటుంబ సమస్యలుంటాయి. రాజకీయా లలోని వారు రాజకీయ మార్పులకై చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి.

మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

వృత్తి, వ్యాపార రంగాలలోని వారికి కార్యలాభం, వ్యవహారాను కూలత. ఉద్యోగులకు బదలీలలో అనుకూలత వుంటుంది. నూతన వస్త్రాభరణ ప్రాప్తి. విద్యార్థులకు ప్రయాణ లాభం వుంటుంది. వ్యవసాయదారులకు గతంలో పూర్తికాని వ్యవహారాలు ఇప్పుడు పూర్తవుతాయి. కళా, క్రీడా రంగాలలోని వారికి ఆర్థికాదాయంలో నూతన మార్పులుంటాయి. రాజకీయాలకు బాగుంటుంది.

జ్యోతిష 'గణితగతాయుష్య' వర్గు సిద్ధాంత వివరణలు!

డాక్టర్ భార్గవ చెన్నై

** వధూవర నక్షత్రాలలో ఏయే సంఖ్య శుభ, అశుభ ఫలితాలనిస్తాయి?*

వధూవర నక్షత్ర సంఖ్యను గురించిన ఈ వివరణను 'గణిత గతాయుష్య' వర్గు అంటారు. వధువు నక్షత్రం నుండి వరుని నక్షత్రం వరకూ 4, 7, 10, 13, 16, 19, 22, 25 నక్షత్రాలలో ఒకటైనా వరుని నక్షత్రమైతే శుభం. కానట్లయితే అశుభ సూచకం!

ఎం.పరిమళాబాయి కర్నూలు

** వాస్తు దోషాలు ఆర్థిక పరిస్థితిని తారుమారు చేస్తాయా?*

ఉత్తర వాస్తు దోషాలు ఆర్థిక పరిస్థితిని ఛిన్నాభిన్నం చేస్తాయి. నిర్ణీత యంత్ర ప్రతిష్ట తర్వాత ఆరు మాసాలలోగా దోషాల్ని సరిదిద్దుకోవాలి.

సి.సుశీలారమణి తిరుపతి

** వాస్తు, జ్యోతిష్యములను సరిచేసుకొంటే ఏం జరుగుతుంది.*

శుభం జరుగుతుంది. సమస్యలు పటాపంచ లవుతాయి. ఆపదల నుంచి, అవమానాల నుంచి గట్టెక్కి సుఖశాంతులతో బ్రతుకుతారు.

ఎ.లలితాజైన్ విజయవాడ

** అమ్మాయి వివాహం ఆలస్యం అవుతుంది. తరుణోపాయం చెప్పండి?*

గ్రహస్థితులు, దైవానుగ్రహం అనుకూలత కోసం పంచముఖ రుద్రాక్ష పూజ మండలం రోజులు చేయించండి!

ఆకెంటి రాజేశ్వరి విజయవాడ

** రాశి, నక్షత్ర వివరాలు పంపిస్తున్నాను. పాప ఆరోగ్యం బాగు పడుతుందా?*

తొలుత పుష్యరాగం(శ్రేష్ఠ) కుడి చిటికెన వ్రేలికి ధరింపజేయండి. వాస్తు యంత్ర(త్రిదోష) ప్రతిష్ఠ కొంత మేలు చేస్తుంది. ఆయుర్వేద మందులు వాడుతూ, సైకియాట్రిస్ట్ సూచనలు పాటించండి.

జె.విశ్వజిత్ హైదరాబాద్

** 'గోళాలు' ప్రతిష్టించుకొంటే మేలు జరుగుతుందా?*

హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాలలో 'గోళాల్ని' గురించి ఎవరో 'డబ్బు కక్కుర్తిపరులు' బాగా ప్రచారం చేసినట్లుంది. అష్టాద్వాదశ వాస్తు శాస్త్రాల్లో ఈ గోళాల ప్రసక్తి లేనేలేదు.

ఘంటికా ఉమాదేవి బెంగుళూరు

** ఆయన వాస్తును నమ్మరు. అంతా మన చేతుల్లోనే ఉందంటారు?*

అలాంటప్పుడు ఆయన ఉద్యోగాన్ని చేజేతులా పోగొట్టుకున్నారా? అలా ఒప్పుకోరుకదా మరి? మనం కష్టపడి పని చేయాలి. లేదా భగవంతుణ్ణయినా నమ్మాలి. ఏదీలేకపోతే ఇలాంటిది మెట్ట వేదాంతం అవుతుంది.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

డాక్టర్ పటేల్ సికింద్రాబాద్

** వధువు నక్షత్రం నుంచి వరుని నక్షత్ర సంఖ్య ఎంత అయితే మంచిది?*

వరుని నక్షత్రం పదమూడవ నక్షత్రం తర్వాతది అయి ఉండాలని పరాశర మహర్షి సూక్తం చెబుతోంది.

వి.సతీష్‌నాయుడు ఆదోని

** గురువుగారూ వాస్తు శాస్త్రాల్ని సప్తమహర్షులు రాశారా? వారెవరు?*

సప్తర్షులు కూడా రాశారు. వారు కశ్యప, అత్రి, భరద్వాజ, విశ్వామిత్ర, గౌతమి, జమదగ్ని, వశిష్ఠ మహర్షులు.

సి.జె.రామచంద్ర కావలి

** పిల్లవాడు బాగా చదువుతాడు. మార్కులు మాత్రం తక్కువవస్తాయి.*

తూర్పు వాస్తు లోపాల్ని ఉత్తరంలో చెప్పిన విధంగా సవరించుకొని, దైవ గృహంలో శీతల యంత్ర ప్రతిష్ట చేయండి. ఫలితం ఉంటుంది.

వి.రుక్మిణీబాయి నాయుడుపేట

** 'వాస్తు ప్రకారం' అని ప్రకటనలు విని ప్లాటు తీసుకొంటే ఆయనకు అన్నీ సమస్యలే వస్తున్నాయి.*

పశ్చిమ వీధి, ఉత్తర ద్వారం ఇది. విదిక్కు కోణవేధలు కూడా ఎక్కువగా ఉన్నాయి. ఆయన్ను నీలం (విలోమ) ధరించమని చెప్పండి. మూడు మాసాల తర్వాత పరిస్థితి మారకపోతే ఇల్లు మారండి.

ఇసుక టెండర్ల వాయిదా వెనుక హైడ్రామా!

ముదివర్తి, కోటితీర్థం, తూర్పు కంభంపాడు, మినగల్లు ప్రాంతాల్లోని ఇసుక రీచ్‌లకు వేలంపాట జరగకుండా కాంట్రాక్టర్లు తెలివైన పన్నాగం పన్నారు. ఇది తెలియక అదనపు జాయింట్ కలెక్టర్ లక్ష్మీకాంతం ఆ ఇసుక ఊబిలో కూరుకుపోయారు.

ఇసుక టెండర్ల వేలం పాటలు నిర్వహించకుండా కాంట్రాక్టర్లు హైడ్రామా నడిపారు. ఇసుక రీచ్‌లకు సంబంధించి రూట్ మ్యాప్‌లు అందజేయాలన్న సాకుచూపి వాయిదా వేయించడంలో చాలా చాకచక్యంగా వ్యవహరించారు. జిల్లాలోని ముదివర్తి, కోటితీర్థం, తూర్పు కంభంపాడు, మినగల్లు ప్రాంతాల్లో ఉన్న ఇసుక రీచ్‌లకు టెండర్లు ఆహ్వానించడం జరిగింది. వేలంపాటలు నిర్వహించేందుకు తేది, సమయాన్ని కూడా కేటాయించారు. భూగర్భ గనులు, పంచాయితీరాజ్ శాఖల ఆధ్వర్యంలో అదనపు జాయింట్ కలెక్టర్ లక్ష్మీకాంతం పర్యవేక్షణలో వేలంపాటలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరిగాయి. అయితే ఊహించని విధంగా ఇసుక కాంట్రాక్టర్లు వేలంపాటలు జరగకుండా ముందుగానే వ్యూహం పన్నారు. ఏదో ఒక కారణం చూపి వేలంపాటల్ని వాయిదా వేస్తే మరికొన్ని రోజులు ఇసుక తరలించి సొమ్ము చేసుకోవచ్చన్నది వీరి అభిప్రాయం.

కాంట్రాక్టర్ల వ్యూహాన్ని పసిగట్టలేని అదనపు జిల్లా జాయింట్ కలెక్టర్ లక్ష్మీకాంతం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి చేతులు దులుపుకున్నారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 28 ఇసుక రీచ్‌లు ఉన్నాయి. నాలుగు నెలల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక రవాణాపై నిషేధం విధిస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. నిషేధం ఉన్నా కూడా అధికార పార్టీ నేతల అండదండలు, పోలీసుల సహకారంతో ఇసుకను తరలించే వారు కాంట్రాక్టర్లు. ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ క్రమంలో ఇసుకకు డిమాండ్ పెరగడంతో కాంట్రాక్టర్లు, వాహన యజమానులు ధరలు పెంచేశారు. ట్రాక్టర్ ఇసుక ఐదు వేల నుంచి ఎనిమిది వేల రూపాయల వరకు ధర పలుకుతుంది. ప్రధానంగా అపార్టుమెంటు నిర్మాణాలు చేపట్టే బిల్డర్లు తప్పనిసరి పరిస్థితుల్లో అధిక ధర చెల్లించి ఇసుకను దిగుమతి చేసుకొంటున్నారు.

ఇసుక రీచ్ దగ్గర నుంచి గమ్యస్థానం చేరే వరకు మనుషులను కాపలాగా ఉంచి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. పోలీసు, రెవిన్యూ శాఖలకు చెందిన సిబ్బందికి మామూళ్లు అందించడంతో కాంట్రాక్టర్లకు సంబంధించిన వాహనాలను వదిలేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి లైసెన్స్ ఫీజు చెల్లించకుండానే ఇసుకను త్రవ్వి సొమ్ము చేసుకొంటున్నారు. మరికొన్ని నెలలపాటు వేలం పాటలు జరగకుండా అడ్డుకుంటే మరింత ఆదాయం గడించే అవకాశం ఉంది. గతంలో నిర్వహించిన ఇసుక రీచ్‌ల వేలంపాటలకు రూట్ మ్యాప్ సమస్య తలెత్తలేదు. ఇటీ వల నాలుగు రీచ్‌లకు వేలంపాటలు నిర్వహించే సమయంలో రూట్‌మ్యాప్ తెరపైకి తెచ్చారు. సమీప గ్రామాలలో వాహనాలు వెళ్లకుండా ప్రజలు నిత్యం అడ్డుకుంటున్నారని, దీంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని సాకుగా చూపారు.

ఇసుక వేలంపాటల నిర్వహణ బాధ్యతలను అదనపు జాయింట్ కలెక్టర్ లక్ష్మీకాంతంకు కలెక్టర్ అప్పగించారు. అయితే వీటిపై సరైన అవగాహన లేకపోవడంతో లక్ష్మీకాంతం గుడ్డిగా కాంట్రాక్టర్ల వాదనతో ఏకీభవించారన్న ప్రచారం జరుగుతోంది. నాలుగు రీచ్‌లకు కూడా పోటీలేకుండా సిండికేటుగా ఏర్పడే ప్రయత్నాలు ముమ్మరంగా జరిగాయి. చివరి క్షణంలో సిండికేటుగా ఏర్పడేందుకు ఒప్పందం కుదరకపోవడంతో వేలంపాటలను వాయిదా వేయించడంలో సఫలీకృతులయ్యారు. ఎటువంటి పెట్టుబడులు లేకపోవడం, లైసెన్స్ ఫీజు చెల్లించే విధానం లేకపోవడంతో కాంట్రాక్టర్లు వేలంపాటలు నిర్వహించక ముందే లక్షలాది రూపాయలు సంపాదించాలన్న ఆలోచనతో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, మంత్రి నివాసం చుట్టూ తిరుగుతున్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఎన్ని ఆరోపణలు వచ్చినా ఒక్క అధికారి కూడా స్పందించలేని పరిస్థితి జిల్లాలో ఉంది. ప్రభుత్వానికి రావాల్సిన కోట్ల రూపాయల ఆదాయానికి గండి కొట్టి సొంత ఆదాయాన్ని పెంచుకొంటున్న వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. వాయిదా వేసిన నాలుగు ఇసుక రీచ్‌ల వేలంపాటలు మరోసారైనా పారదర్శకంగా నిర్వహించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

రచ్చ - రచ్చ

వివాదాల మయమైన వైద్య ఆరోగ్య శాఖ!

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఇటీవల 52 మంది కాంట్రాక్టు సిబ్బందిని తొలగించడం జరిగింది. ఈ వ్యవహారమై ఆ శాఖలో పెద్ద దుమారం చెలరేగింది. అంతిమంగా ఏమౌతుందన్నది అప్పుడే చెప్పలేని పరిస్థితి నెలకొని ఉంది.

ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అధికారులు, సిబ్బంది పరిపాలనపరమైన అంశాలపై దృష్టి సారించకుండా వ్యక్తిగత విషయాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో ఇటీవల 52 మంది కాంట్రాక్టు సిబ్బందిని తొలగించడం జరిగింది. తమను అన్యాయంగా తొలగించారంటూ ఆరోగ్య సహాయకులు ఆందోళన మొదలెట్టారు. జిల్లా అధికారి మాత్రం రాష్ట్ర ప్రభుత్వం నుంచి జారీ అయిన ఉత్తర్వుల మేరకు కాంట్రాక్టు సిబ్బందిని తొలగించాల్సి వచ్చిందని చెబుతున్నారు. దీంతో అధికారులు, సిబ్బంది మధ్య వివాదం ముదిరి పాకాన పడింది. వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి సిబ్బంది తొలగింపు ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్ పరిశీలించకుండానే ఆమోదం తెలిపారన్న విమర్శ వుంది. అధికారులపై వున్న నమ్మకం కారణంగా కలెక్టర్ ప్రతిపాదనలపై సంతకం చేసినట్లు తెలుస్తుంది.

నిబంధనలకు విరుద్దంగా తొలగించడం అన్యాయమంటూ సిబ్బంది డిఎంఅండ్‌హెచ్‌ఓను ప్రశ్నించడంతో మరోసారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిశీలన చేస్తామని హామీ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు సైతం ఒకేసారి 52 మంది కాంట్రాక్టు సిబ్బందిని తొలగించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రాలను ప్రభుత్వానికి పంపినారు. రానున్న వర్షాకాలంలో అంటువ్యాధులు వ్యాపించే అవకాశం వుంటుంది. ఇటువంటి సమయంలో కాంట్రాక్టు సిబ్బందిని తొలగిస్తే సిబ్బంది కొరత ఏర్పడి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం వుంది.

సిబ్బంది తొలగింపుతోపాటు బదలీల కౌన్సిలింగ్ కూడా చేపట్టారు. ఈ బదలీల వ్యవహారంలోనూ పలు అవకతవకలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలు వున్నాయి. సీనియారిటీని పరిగణలోకి తీసుకోకుండా ఇష్టానుసారంగా బదలీలు నిర్వహించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకే ప్రాంతంలో మూడు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న వారిని వేరొక ప్రాంతానికి బదలీ చేయాల్సి వుండగా, రాజకీయ సిఫార్సుల నేపథ్యంలో ప్రక్క మండలానికే బదలీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఉద్యోగులు, అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో శాఖాపరంగా చేపట్టే కార్యక్రమాలు, అమలుచేసే పథకాల్లో ప్రగతి కానరాకుండా పోయింది. జిల్లా ఉన్నతాధికారి తనిఖీల పేరుతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లినప్పుడు సిబ్బంది తీరుపై ఘాటుగానే స్పందిస్తూ మెమోలు జారీ చేస్తున్నారు.

స్థానికంగా నివాసం వుండడం లేదన్న కారణం చూపి చర్యలు తీసుకుంటామని పత్రికల ద్వారా హెచ్చరికలు చేస్తున్నారు. జిల్లాలో ఎఎన్ఎం నర్సు దగ్గర నుంచి క్లస్టర్ అధికారి వరకు స్థానికంగా నివాసం వుండాలన్న నిబంధన వుంది. అయితే 46మండలాల్లో వైద్య, ఆరోగ్యశాఖలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, వైద్యులు నెల్లూరు, కావలి, గూడూరు ప్రాంతాల్లో నివాసం ఏర్పాటు చేసుకుని రాకపోకలు సాగిస్తుంటారు. ముందుగా డిఎంఅండ్‌హెచ్‌ఓ నివాసంలేని వైద్యులపై చర్యలు తీసుకొని ఆ తర్వాత ఇతర సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్న వాదన ఉద్యోగుల నుంచి వినిపిస్తుంది. జిల్లాస్థాయి అధికారిగా ఎవరు వచ్చినా విధులకు డుమ్మాకొట్టి ప్రైవేట్ క్లినిక్‌లు నిర్వహిస్తున్న వైద్యులపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

మొన్నటి వరకు ఎఓగా పని చేసిన వ్యక్తిపై శాఖాపరంగా అనేక ఆరోపణలు వచ్చాయి. వీటిపై జిల్లా కలెక్టర్ విచారణ కూడా జరిపించారు. సదరు ఎఓ పదవీ విరమణ చేసినా కూడా విచారణ నివేదికను బహిర్గతం చేయడం గాని, ఆయనపై చర్యలు తీసుకోవడం గాని జరగలేదు. దీంతో అధికారుల పట్ల క్రిందిస్థాయి సిబ్బందికి నమ్మకం లేకుండాపోయింది. వైద్య, ఆరోగ్యశాఖలో అధికారులు, సిబ్బంది మధ్య ఏర్పడిన వివాదం వైద్య సేవలకు విఘాతం కలిగించే విధంగా పరిణమించడం విశేషం.




✍ అల్లూరు రహీం

మగధీర చిత్రంతో తెలుగు చలన చిత్రపరిశ్రమలో పెద్ద దర్శకునిగా ఎదిగిపోయిన ఎస్.ఎస్. రాజమౌళి తీసిన తొమ్మిదవ చిత్రం ఈగ. ఇది పూర్తిగా గ్రాఫిక్స్ ఓరియెంటెడ్ చిత్రం. ఈ సినిమా తీయను ఏడాదిన్నరగా రాజమౌళి పడిన శ్రమ పూర్తిస్థాయిలో ఫలించలేదనాలి. రాజమౌళి చేతిలోపడితే చిన్న సినిమా కాస్తా పెద్ద సినిమా అయిపోతుందనేది తెలుగు సినిమా పరిశ్రమలో నానుడి. చిన్న చిత్రానికి కూడ పెద్ద సినిమాలా ప్రచారం తీసుకోరావడం రాజమౌళి బృందానికి తెలిసినంతగా మరొకరికి తెలియదని ఈగ సినిమాకు వెళ్లిన తర్వాత ప్రేక్షకులు అర్థం చేసుకొంటారు. ఈ సినిమా ఆడియో విడుదల చేసిన రోజు రాజమౌళి చేసిన హంగామా టివీల్లో చూసిన ప్రజలు ఎప్పుడు ఈ సినిమా వస్తుందని ఎదురు చూడసాగారు. కాని విడుదలయ్యాక చూస్తే ఇది చిన్న పిల్లల సినిమాననే చెప్పకతప్పదు. ఈ చిత్రంలో అబ్బురపరిచేలా గ్రాఫిక్స్ విన్యాసాలు లేవు. లోకల్ గ్రాఫిక్స్ టాలెంట్ వాడడం వల్ల ఇలా తయారయ్యింది. సినిమాలో వీనుల విందైన సంగీతం లేదు. కీరవాణి సంగీతం కూర్చిన మూడు పాటలు ముదనష్టంగానే వున్నాయి. బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కూడా రాజమౌళి చెప్పినంత గొప్పగా లేదు. గ్రాఫిక్స్ విన్యాసాల్లో ఈగ ప్రాణం పోసుకోవడం, ఒక వరద నుంచి తప్పించుకోవడం, తన ప్రియురాలిని తాకే ప్రయత్నం చేసే విలన్‌ను ముప్పతిప్పలు పెట్టడం, కారు యాక్సిడెంట్, అతని ఇల్లు ధ్వంసం వంటివి బాగున్నాయి. హీరో చనిపోయాడని హీరోయిన్ కన్నీరు కారుస్తుండగా ఈగ ఆ నీటితోనే నేను వున్నాను మళ్లీ పుట్టానని వ్రాయడం బాగుంది.

చిత్ర సమీక్ష

ఈగను చంపను వికృత అవాహన యాగం వంటివి వికృతంగా ఉన్నాయి. చిత్రంలో ఒకే ఒక సీనులో తాగుబోతు రమేష్ మాటలు లేకుండా చేతలతో చేసే స్కిట్‌లాంటి కామెడీ బాగుంది. ఇది ప్రేమకథా చిత్రమైనా మనసును తాకే మాటలు లేకపోవడం పెద్ద లోపం. ఏడిస్తే మర్చిపోవచ్చుంటారు. కాని ఎంత ఏడ్చినా మరుపుకు రావడం లేదన్నదే ఈ చిత్రంలో గొప్ప డైలాగ్. ఈ సినిమా మొత్తం ఈగ, నాని, సమంత, సుదీప్ పాత్రల మధ్య నడుస్తుంది. నలుగురూ నటనలో పోటీ పడ్డారు. నాని, సమంత ముద్దుగా వుంటే సుదీప్ వికృతంగా కనపడితే, ఈగ రకరకాల విన్యాసాలతో అలరిస్తుంది. సెంథిల్‌కుమార్ మంచి కెమెరామెన్. కానీ ఈ సినిమాలో చీకటి వెలుతుర్లు ప్రసరించే సన్నివేశాలు గందరగోళంగా తీశాడాయన.

చిత్ర కథలోనికి వెళ్తే ఎదురెదురు ఇళ్లలో వుండే నాని (నాని), బిందు (సమంత) ప్రేమికులు. కాని వారి ప్రేమను వెల్లడి చేసుకోరు. కన్‌స్ట్రక్షన్స్ యజమాని సుదీప్ (సుదీప్)కు ఆడవాళ్ల పిచ్చి. స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహణకు విరాళం అడగను వెళ్లిన బిందును చూసి ఆమెను ఎలాగైనా అనుభవించాలనుకొంటాడు సుదీప్. దీనికి అడ్డంగా వున్నాడని నాని చంపేస్తాడు. నాని ఆత్మ ఈగలో ప్రవేశిస్తుంది. సుదీప్‌ను నానా తిప్పలు పెడుతుంది. నాని చనిపోయాడని బాధపడుతుండే బిందు దగ్గరకు వెళ్లే ఈగ తాను నాని నంటుంది. ప్రేమికులిద్దరూ కలసి సుదీప్‌ను చంపాలనుకొంటారు. కొన్ని కష్టాలెదురైనా వీటిని అధికమించి అతన్ని చంపేయడంతో చిత్రం ముగుస్తుంది. ప్రథమార్ధంలో స్లోగా వుండే స్క్రీన్‌ప్లే ద్వితీయార్ధంలో వేగం పుంజుకోవడం వల్ల ఈగ ను ఒక్కసారి ఇబ్బంది లేకుండా చూడొచ్చు.



అందరూ బాగుండాలి

హీరో పవన్‌కళ్యాణ్ వెండితెర జీవితం వేరు, వ్యక్తిత్వం వేరు. ఆయన నటించి ఇటీవల విడుదలైన గబ్బర్‌సింగ్ చిత్రం ఎన్ని రికార్డులు బద్దలు కొట్టింది, ఎన్నికోట్లు వసూలు చేసింది వంటి విషయాలు ఆయన ఎప్పుడూ ఆరాతీయడు. తన లోకంలో తానుంటాడు. 'కెమెరామెన్ గంగతో రాంబాబు' సినిమా షూటింగ్‌లో ఆయన పిచ్చాపాటీగా మాట్లాడారు. ఇలాంటి సినిమాలు చేయాలి, ఈ తరహా పాత్రలతో ప్రేక్షకుల్ని మెప్పించాలి అని నేనెప్పుడూ అనుకోను. ప్రణాళికలు రూపొందించుకోవడం నాకు తెలీదు. అలా చేసినా ఫలితం ఉండదేమో అనిపిస్తుంది. ఆ సమయంలో ఆ కథ ఓకే అనిపిస్తే... నటించేవాడిని. రికార్డుల గూర్చి నేనెప్పుడూ పట్టించుకోలేదు. సినిమా పరిశ్రమ అంతా నా కుటుంబమే అనుకుంటాను. అందరి సినిమాలు బాగా ఆడాలి. నా సినిమాలకు ప్రేక్షకులు ఎందుకొస్తారో నాకు తెలుసు. వారికి వినోదం పంచిపెట్టడమే తన కర్తవ్యమన్నారాయన.

సునీల్ సరసన అక్ష



కామెడీ నటుడు సునీల్ హీరో అయిపోయాడు. పూలరంగడు తర్వాత 'తను వెడ్స్ మను' సినిమాలో హీరోగా నటిస్తున్నాడు. బెల్లంకొండ సురేష్ నాగచైతన్యతో నిర్మించే చిత్రంలోనూ సెకండ్ హీరోగా చేస్తున్నాడు. ఇందులో చైతన్య సరసన హన్సిక హీరోయిన్. సునీల్ సరసన అక్షను ఎంపిక చేశారు. గత ఏడాది ఈమె కందిరీగతో ప్రేక్షకులను ఆకట్టుకొంది. శ్రీకాంత్ సరసన కూడా మరో చిత్రంలో నటించే అవకాశం అక్ష దక్షించుకొంది.



విష్ణు చిత్రంలో ప్రభాస్

మంచు విష్ణు హీరోగా నటిస్తున్న చిత్రం 'దేనికైనా రెడీ' ఈ సినిమాకు బి.నాగేశ్వరరెడ్డి దర్శకుడు. ఈ చిత్రంలో హీరో ప్రభాస్ కూడా కనపడనున్నాడు. ఆద్యంతం వినోదాత్మకంగా సాగే ఈ చిత్రంలో అతిధి పాత్రలో కనిపించే ప్రభాస్ కొన్ని పవర్‌పుల్ డైలాగులు చెబుతాడు. అయితే ఈ విషయం మీద చిత్రవర్గాలు గోప్యత పాటిస్తున్నాయి. 'ఢీ' తరహాలో వినోదాత్మకంగా సాగే ఈ చిత్రంలో తగు మోతాదులో యాక్షన్ అంశాలు వుంటాయి. ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరుగుతుంది.

బాలీవుడ్‌కు ముమైత్‌ఖాన్!



ముమైత్‌ఖాన్ తెలుగు ప్రేక్షకులను బాగా ఆకట్టుకొన్న నృత్యతార. ఒక దశలో ఆమె పాట లేకుండా చిత్రం ఉండేది కాదు. ఆ తర్వాత కొన్ని చిత్రాల్లో ముఖ్యపాత్రల్లోనూ, నాయికగాను నటించిన ఆమెకు గత ఏడాదిన్నరగా తెలుగు చిత్రాలు లేవు. దీంతో ఆమె మళ్లీ బాలీవుడ్ గడప తొక్కింది. రౌడీ రాథోడ్ చిత్రంలో ప్రత్యేక గీతంలో నటించిన ఆమె ఆ సినిమా విజయవంతం కావడంతో అక్కడే అవకాశాలు వెదుక్కొంటోంది. తెలుగు తెరపై ఐటమ్ డ్యాన్సర్లు, విదేశీ నృత్యతారలు వస్తున్న తరుణంలో ముమైత్, అభినయశ్రీ వంటి తారలకు ఇక్కడ అవకాశాలు బాగా తగ్గిపోయాయి.



గువ్వ గోరింక పాటలో చరణ్

ఖైదీనెంబర్ 786 సినిమాలో చిరంజీవి – భానుప్రియ పాడుకొన్న గువ్వా గోరింకతో ఆడిందిలే బొమ్మలాట పాటను సంగీత ప్రియులు మరచిపోలేరు. 1988లో విడుదలైన ఈ సినిమా పాటను రామ్‌చరణ్ కథానాయకుడిగా వివి వినాయక్ దర్శకత్వంలో తయారయ్యే చిత్రంలో పెట్టే ఆలోచన చేస్తున్నారట. ఈ చిత్రంలో అమలాపాల్, కాజల్ అగర్వాల్ హీరోయిన్లు. బహుశా రామ్‌చరణ్, కాజల్‌తో ఈ పాట చిత్రీకరించవచ్చు.

కౌన్సిలింగ్‌కు ముందే అక్రమాలు!

అందువల్లే అగుడు పట్టిన టీచర్ల కౌన్సిలింగ్

ఉపాధ్యాయుల బదలీల కౌన్సిలింగ్ ప్రక్రియలో గతంలో ఎన్నడూలేని విధంగా అక్రమాలు చోటు చేసుకొన్నాయి. పగలు, రాత్రి అనే తేడాలేకుండానే ఏ ప్రాంతానికి బదలీ చేస్తారోనన్న ఆత్రుతగా ఉపాధ్యాయులు కౌన్సిలింగ్ జరిగేచోట పడిగాపులు కాస్తుంటే, కొందరు టీచర్లు డబ్బు, రాజకీయ పలుకుబడి, అధికారుల అండదండలతో ప్రభుత్వ ఉత్తర్వులు(జీవో) తెచ్చుకొని హెచ్‌ఆర్‌ఏ వచ్చే ప్రాంతాల్లోని పాఠశాలలకు, సమీపంలోని పాఠశాలలకు బదలీ కావడం పైరవీలకు అద్దం పట్టింది. నెల్లూరు రూరల్, ఇందుకూరుపేట, కోవూరు తదితర మండలాల్లోని 32 ప్రాంతాలకు ఈ విధంగా కొందరు ఉపాధ్యాయులు గవర్నమెంటు ఆర్డర్లు తెచ్చుకొన్నారు. దీనికి విద్యాశాఖ మంత్రి కార్యాలయంలో ప్రాంతాన్ని బట్టి ఒక్కో జీవోకు లక్షన్నరకు పైగా చేతులు మారినట్లు సమాచారం. దీనికి జిల్లాకు చెందిన మంత్రి సిఫార్సుచేయగా జిల్లా విద్యాశాఖాధికారి మువ్వా రామలింగం అండదండలు అందించారని శాసనమండలి సభ్యులు, పలు ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. అలా జీవోలు తెచ్చుకొన్న ఉపాధ్యాయులకు ఆగమేఘాలపై ఉత్తర్వులు ఇవ్వడంతోపాటు వారిని తక్షణం జాయిన్ చేసుకోమని ఆయా మండల విద్యాశాఖాధికారులకు డిఇఓ ఆదేశాలివ్వడం వివాదానికి కారణమైంది. ఈ జీవోలపై ఆగ్రహించిన ఉపాధ్యాయ సంఘాలు గొడవకు దిగడం, ఒక దశలో ఉద్రిక్తత నెలకొని డిఇఓ రామలింగంపై దాడికి యత్నించడం, ఆయన అక్కడి నుంచి తప్పించుకొని పోలీసుల సహాయంతో బయటపడడం రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశమయ్యింది. ఏ జిల్లాలో జరగని విధంగా ఇక్కడ బదలీల కౌన్సిలింగ్ ప్రక్రియ అబందరగా మారడానికి డిఇఓనే కారణమని ప్రతి ఒక్కరూ విమర్శిస్తున్నారు. కొన్ని పోస్టులు బ్లాక్ చేయడం, జీవో తెచ్చుకొన్న వారి పాత పోస్టులు జాబితాలో చూపకపోవడం లాంటి వాటి పట్ల ఉపాధ్యాయ సంఘాలు మండి పడుతున్నాయి. ఎన్ని ఘటనలు జరిగినా, పరాభవం జరిగినా బుద్ధిమారదని డిఇఓ రామలింగం మరోసారి రుజువుచేసుకొన్నట్లయ్యింది.



డిఇఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు.


ప్రభవ తొలి బడిలోని పిల్లలతో విదేశీ బృందం.

ప్రభవ తొలి బడికి అమెరికా బృందం!

బోధన బాగుందని ప్రశంస

నెల్లూరు పొగతోటలోని ప్రభవ పిల్లల బడిలో బోధనా పద్ధతులు అధ్యయనం చేయడానికి అమెరికాలోని టెక్సాస్ యూనివర్శిటీకి చెందిన ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ స్కాలర్స్ బృందం సందర్శించింది. బృంద సభ్యులు కిష్టోఫర్, టిమ్, జాషువ, కుమారి మేరీ, కుమారి మిషెల్ ప్రభవ బడిలోని బోధనా పద్ధతులు, ఓపెన్ కర్రిక్యులం మొదలగు అంశాలను పరిశీలించారు. సంస్థ డైరక్టర్ శ్రీమతి చంద్రలతను ఇక్కడి బోధనా పద్ధతి పట్ల అభినందనలు తెలిపారు. ప్రభవలోని పిల్లలు బాలల గీతాలు, ఆటలు, సంగీత వాయిద్యాలతో ఆహూతులను అలరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ వి.ఏ.రత్నరాజకుమార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా గురుపూర్ణిమ!

నెల్లూరు గాంధీనగర్‌లోని శ్రీ షిర్డి సాయిబాబా మందిరంలో ఈ నెల 3వ తేది నుండి 12వ తేది వరకు గురుపూర్ణిమ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. గురుపూర్ణిమ రోజు భక్తులు అధిక సంఖ్యలో బాబాను సందర్శించారు. ప్రతిరోజు ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, సహస్ర నామపూజలు జరిగాయి. 9వ తేది బాబా నగరోత్సవం మేళతాళాల మధ్య వైభవంగా జరిగింది. పుష్పాలంకరణ బాణసంచా, విద్యుత్ దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకొంది. 12వ తేది నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వేల సంఖ్యలో భక్తులు పాల్గొని బాబా ప్రసాదాన్ని స్వీకరించారు. ప్రతిరోజూ సాయంత్రం కోఆపరేటివ్ బ్యాంకు ఆవరణలో శ్రీకృష్ణ కథామృతాన్ని డాక్టర్ మేడసాని మోహన్ భక్తులకు అద్భుతంగా చెప్పారు. ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను దగ్గరుండి మందిరం ఛైర్మన్ మన్నెం అమర్‌నాథ్‌రెడ్డి పర్యవేక్షించారు.


గాంధీనగర్ సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు.



పోటీ వివరాలను తెలియజేస్తున్న నాజ్ అధినేత లలిత్‌జైన్.

నాజ్ పరిపూర్ణ మహిళ పోటీ!

నెల్లూరు ఆచారివీధిలోని నాజ్(న్యూ ఆంధ్రా జ్యూయలరీ) శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని మహిళలకు నాజ్ పరిపూర్ణ మహిళ పోటీలను తొలిసారిగా నిర్వహించ తలపెట్టిందని షోరూం అధినేత లలిత్‌జైన్ చెప్పారు. 10వ తేది షోరూంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ పోటీలో ప్రతి గృహిణి పాల్గొనవచ్చు. దీనికోసం నాజ్ జ్యూయలరీలో దొరికే దరఖాస్తు ఫారాన్ని పూర్తిచేసి అక్కడే ఏర్పాటుచేసే డ్రాప్ బాక్స్‌లో వేస్తే సరిపోతుంది. 27వ తేది శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని షోరూంలోని ఎగ్జిబిషన్ హాల్‌లో నాజ్ పరిపూర్ణ మహిళ పోటీలో పాల్గొని ప్రతిభ చూపిన గృహిణికి నాజ్ పరిపూర్ణ మహిళగా పట్టువస్త్రాలతో సత్కరించి బంగారు కుంకుమ భరిణ కానుకగా ఇస్తారు. ఈ పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకు నాజ్ మెంబర్‌షిప్ కార్డును కానుకగా ఇస్తారు. ఈ పోటీ చాలా సులభతరంగానే ఉంటుందని నెల్లూరు మహిళలు దీనిలో పాల్గొని తమ ప్రతిభ ప్రదర్శించవచ్చని, ఈ పోటీని ప్రతి ఏడాది నిర్వహించే ఆలోచన చేస్తున్నట్లు లలిత్‌జైన్ వివరించారు.

పేదలు దుర్భర జీవనం గడుపుతున్నారు!



బహిరంగ సభలో మాట్లాడుతున్న సినీనటుడు ఆర్.నారాయణమూర్తి.

నగరంలోని టౌన్‌హాలులో ఈ నెల 4వ తేదీన అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. అమరవీరుల బంధుమిత్రుల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు జిల్లా నలుమూలల నుంచి విప్లవ, ప్రజాసంఘాల అభిమానులు, సానుభూతిపరులు, వివిధ ఎన్‌కౌంటర్లలో మరణించిన వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. విప్లవ రచయితల సంఘం కార్యవర్గ సభ్యుడు, సినీ నటుడు కాకరాల మాట్లాడుతూ పీడిత ప్రజల హక్కుల కోసం ఎంతో మంది విప్లవకారులు తమ అమూల్యమైన ప్రాణాలు త్యాగం చేశారని కొనియాడారు. నెల్లూరు జిల్లాకు చెందినవారు తెలంగాణ జిల్లాల్లో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లలో మరణించారని ఆయన గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల జీవన విధానానికి విఘాతం కలిగిస్తూ వారి హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు. అమరవీరుల బంధుమిత్రుల కమిటీ నాయకుడు గంటి ప్రసాదం మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలుస్తున్న విప్లవ, ప్రజాసంఘాల నేతలను బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చి చంపుతున్నారని, దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. పేద ప్రజలకు చెందిన పచ్చటి మాగాణి భూములను పరిశ్రమల పేరుతో బడా వ్యాపారవేత్తలకు అప్పగిస్తున్నారని విమర్శించారు. ప్రశ్నించిన వారిని అరెస్టుచేసి జైల్లో పెడుతున్నారన్నారు. విప్లవ చిత్రాల కథానాయకుడు ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ నేటి సమాజంలో పేద ప్రజలు దుర్భర జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు భూములు అప్పగించడాన్ని ప్రశ్నిస్తే పోలీసులను మోహరించి లాఠీఛార్జి, కాల్పులు జరిపిస్తుందంటూ శ్రీకాకుళం జిల్లా లక్ష్మింపేట సంఘటనను ఉదహరించారు.

విశ్వం గుట్టు రట్టవుతుంది!

8వ పేజీ కొరవ

సిద్ధాంతాన్ని అల్బర్ట్ ఐన్‌స్టీన్ వంటి ప్రతిభావంతుడు గుర్తించి, బోస్ – ఐన్‌స్టీన్ స్టాటిస్టిక్స్ అనే పేరు పెట్టాడు. సత్యేంద్రనాథ్ బోస్ ప్రతిపాదించిన అణువులోని కణాల కదలికల ఆధారంగా హిగ్స్ దైవ కణాన్ని వూహించాడు కాబట్టి, దానికి హిగ్స్ బోసన్ అనే పేరు పెట్టారు.

అద్భుత ప్రయోగం

ఈ దైవ కణం అంతుచూడాలన్న శాస్త్రవేత్తల కలల ఫలితం – లార్జ్ హాడ్రన్ కొల్లిడార్ ప్రయోగం. స్విట్జర్లాండ్, ఫ్రాన్స్ దేశాల సరిహద్దులో; భూమికి 350 అడుగుల లోతున; 12 అడుగుల వ్యాసంతో 27 కిలోమీటర్ల పొడవైన సొరంగాన్ని నిర్మించారు శాస్త్రవేత్తలు. కంటివేగానికి కొన్ని రెట్లు అధికమైన వేగంతో ప్రోటాన్లను రెండు వైపుల నుంచి ప్రవహింపచేసి, అవి ఒకదానితో ఒకటి ఢీకొనేట్లు చేయడమే ఈ ప్రయోగం. ఈ విస్ఫోటనం సమయంలో ఒక్కొక్క ప్రోటాన్‌కు 350 కోట్ల ఎలక్ట్రాన్ వోల్టుల శక్తి వుంటుంది వాటికి. ఆ విస్ఫోటనంలో పుట్టుకొచ్చే సూక్ష్మ అగ్ని గోళాల మీద పరిశోధన చేయడం ఈ ప్రయోగ లక్ష్యం. ఎలక్ట్రాన్, న్యూట్రాన్, ప్రోటాన్లను కలిపి ఒక అణువుగా మార్చిన సూక్ష్మాతి సూక్ష్మ పదార్థం ఏది అన్నది కనుగొనడానికి జరిపిన ఈ ప్రయోగం విజయవంతమైనదని ప్రకటించారు శాస్త్రవేత్తలు. అంటే, సృష్టికి మూలం కనిపెట్టారన్న మాట. సృష్టి భగవంతుడి దయ అన్న నమ్మకాన్ని ఒమ్ము చేశారన్నమాట. సూర్యుడు, గ్రహాలు, భూమి, దాని మీద వున్న సకల చరాచర జీవులకు మూలమైన కణాన్ని కనిపెట్టడంలో శాస్త్రవేత్తలు సాధించిన ఈ విజయం భౌతిక, ఖగోళ శాస్త్రాలను ఎంతో ముందుకు తీసుక వెళ్లడానికి ఉపకరిస్తుంది.

ప్రయోగం ఖరీదు 55వేల కోట్లు!

రెండు వేల ఏళ్ల క్రితం భూమి గుండ్రంగా వుందన్న నిజం తెలియదు. 500 వందల సంవత్సరాల క్రితం వరకు – భూమి తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుడి చుట్టూ కూడా తిరుగుతుందన్న నిజం మనకు తెలియదు. వందేళ్ల క్రితం నాటికి, భూమి, ఇతర గ్రహాలు, నక్షత్రాలతో కూడిన పాలపుంత – అటువంటి కొన్ని వందల కోట్ల పాలపుంతలలో ఒక ఇసుక రేణువు వంటిదన్న నిజం తెలియదు. ఇప్పుడు విశ్వం దైవ కణం వల్ల విశ్వం మూలాలు మనకు ఎంతో కొంత అర్థమౌతాయి. ప్రాణుల పుట్టుకకు మూలమైన డిఎన్ఎ అనే జీవ కణాన్ని కనిపెట్టిన తర్వాత జీవశాస్త్రం ఎంతగా అభివృద్ధి చెందిందో, ఈ దైవ కణం కనుగొన్న తర్వాత ఖగోళ, భౌతిక శాస్త్రాలు కూడా అంతే వేగంగా అభివృద్ధి చెందుతాయి. అయితే ఇప్పటికిప్పుడు మాత్రం ఈ కణాన్ని కనిపెట్టడం వల్ల కలిగే ఉపయోగాలు ఏమిటో ఆ ప్రయోగం నిర్వహించిన శాస్త్రవేత్తలు కూడా చెప్పలేక పోతున్నారు.

కేవలం, పదార్థానికి మూలమైన కణం ఏమిటి అనే కుతూహలాన్ని నెరవేర్చుకోవడానికి శాస్త్రవేత్తలు జరిపిన ఈ ప్రయోగం ఖరీదు 55వేల కోట్ల రూపాయలు. దాదాపు పన్నేండేళ్ల పాటు ఇందు కోసం వందలాది మంది శాస్త్రవేత్తలు అహోరాత్రులు శ్రమ చేశారు.

నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న అతిపెద్ద సమస్య కరెంట్ కోతేనన్నారు. ఇప్పటికే దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులు అప్రకటిత కోతతో, తీవ్ర వర్షాభావ పరిస్థితుల నడుమ తల్లడిల్లి పోతున్నారన్నారు. రైతులకు ఏడు గంటలపాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతూ కేవలం ఒకే ఒక్క గంట మాత్రమే ఇచ్చి సరిపెడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కొమ్మి లక్ష్మయ్య నాయుడు, నెలవల సుబ్రహ్మణ్యం, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పులిమి శైలజ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం వెంకటరమణారెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

15న ప్రభవ కామన్ ఎంట్రన్స్ టెస్ట్

నెల్లూరు పొగతోటలోని ప్రభవ ఆఫ్టర్ స్కూల్ పిల్లల కోసం జూలై 15న కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకురాలు చంద్రలత ఒక ప్రకటనలో తెలిపారు. ట్రినిటీ కాలేజ్ ఇంగ్లీష్ కోర్సుకు, ఆఫ్టర్ స్కూలు కోర్సుకు ఇది ప్రవేశ పరీక్షన్నారు. పొగతోటలోని ప్రభవ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు ఈ పరీక్ష జరుగుతుందని తెలిపారు.

గోపాల్‌రెడ్డి ఉమెన్స్ అకాడమీ ఘనత!

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఇటీవల ప్రకటించిన డిగ్రీ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో నెల్లూరు డాక్టర్ బెజవాడ గోపాల్‌రెడ్డి ఉమెన్స్ అకాడమీలో బికాం ప్రథమ సంవత్సరం చదువుతున్న షేక్ అమీనా యూనివర్శిటీ ఫస్ట్ ర్యాంకర్‌గా నిలచింది. ఈ విద్యార్థినిని యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ బి.రాజారామిరెడ్డి, రిజిస్ట్రార్ వి.నారాయణరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జెవిరెడ్డి, తుంగా శివప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీమతి డాక్టర్ బి.కె.విరోనికా, వైస్ ప్రిన్సిపాల్ వి.మృదుల కూడా పాల్గొన్నారు.

అన్నదానం

ప్రముఖ స్థిరాస్థి వ్యాపారి, మల్లాం వాస్తవ్యుడు వేనాటి బాలసుబ్రహ్మణ్యంరెడ్డి గురుపౌర్ణమి పండుగను పురస్కరించుకొని జిల్లాలోని పలు దేవాలయాల్లో అన్నదానం చేశారు. మల్లాంలోని సాయిబాబా మందిరం, పొదలకూరులోని సాయిబాబా మందిరం, నెల్లూరు శ్రామికనగర్‌లోని భగవాన్ వెంకయ్యస్వామి దేవస్థానంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. తన సతీమణి వేనాటి సుజాతమ్మ స్మృతిలో భాగంగా ఆయన ఈ కార్యక్రమాలను చేశారు.

బిజెపి నిరసన

విద్యుత్ కోత ఎత్తివేసి సర్‌ఛార్జీలను రద్దు చేయాలని కోరుతూ బిజెపి కార్యకర్తలు మినీబైపాస్ రోడ్డులోని మిలీనియం సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి మిడతల రమేష్, మండ్ల ఈశ్వరయ్య, బుజ్జమ్మ, రోశయ్య, గుర్రం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘం

దక్షిణ సింహపురి బ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గ ఎన్నికలు ఇటీవల జరిగాయి. అధ్యక్షులుగా గ్రిద్దలూరు వెంకట శివనారాయణ, అసోసియేట్ అధ్యక్షులుగా ఎ.ఎమ్.ఎస్.ప్రసాద్, కోశాధికారిగా టి.సుబ్రహ్మణ్యం, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పసుమర్తి జగదీష్‌బాబులచే ఎన్నికల అధికారి రాళ్లపల్లి రామసుబ్బారావు పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు.

ప్రహసనంగా ఓటర్ల జాబితాలు

మళ్లీ ఓటర్ల జాబితాల్లో పేరు నమోదు చేసుకొనేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. జాబితాలో పేర్లు లేని వారి పేర్లు నమోదుతోపాటు, మార్పులు చేర్పులు చేస్తామంటున్నారు. ప్రతిసారి ఓటర్ల జాబితా తయారీ ప్రహసనంగా తయారవుతుంది. మార్పు చేర్పులు చోటు చేసుకోవడం లేదు. దీనికి కారణమేమిటో పై అధికారులు పరిశీలించడం లేదు. దీని వల్ల విలువైన ఓటును వేలాది మంది కోల్పోతున్నారు.

వరుణ జపం

లోక కళ్యాణార్థం నెల్లూరు మూలపేటలోని మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో 16వ తేది వరుణ జపాన్ని నిర్వహిస్తున్నట్లు జంట ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డిలు చెప్పారు. 9వ తేది తిప్పరాజు వెంకట సుబ్బయ్య కళ్యాణ సదన్‌లో నగరంలోని వేద పండితులు, బ్రాహ్మణోత్తములతో సమావేశం జరిపారు. 15వ తేది నెల్లూరు గ్రామదేవతకు పొంగళ్లుపెట్టి, 16వ తేది రంగడి దేవస్థానం నుంచి వెయ్యి ఘటాలతో పెన్నమ్మ నీటిని తీసుకెళ్లి మూలస్థానేశ్వర స్వామిని అభిషేకిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమానికి మాచవోలు రాజశేఖరశాస్త్రి నేతృత్వం వహిస్తారు.

ఇందిరాభవన్‌లో వైఎస్ జయంతి!

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 63వ జయంతిని ఇందిరా భవన్‌లో పిసిసి కార్యదర్శి ఉడతా వెంకట్రావ్, పిసిసి బిసి సెల్ కన్వీనర్ రఘు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పందిళ్లపల్లి అరుణమ్మ నేతృత్వంలో జరిగింది. వైఎస్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించిన నేతలు ఆయన చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను వివరించారు.

రాష్ట్రంలో తుగ్లక్ పాలన

రాష్ట్ర ప్రభుత్వ పాలనను తుగ్లక్ పాలనగా అభివర్ణించాడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్. రాజన్నభవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్ – ఢిల్లీ యాత్రలు చేస్తున్నాడని విమర్శించారు. విద్యుత్‌కోతతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణం విద్యుత్ కోతలను ఆపకపోతే ప్రజా ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు.

17న విద్యాసంస్థల బంద్

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని, కార్పొరేట్ విద్యాసంస్థల విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 17న విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ ప్రకటించింది. సిపిఎం కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి చంద్రమోహన్ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్నాయన్నారు.

సామూహిక అత్యాచారం

నెల్లూరు వనంతోపు సెంటర్‌లో చెత్త కాగితాలు ఏరుకొని బతికే 40 ఏళ్ల గుర్తు తెలియని మహిళపై 3వ తేది వేకువజామున కొందరు అగంతకులు సామూహిక అత్యాచారం చేసి చంపేశారు. ఈ మహిళ తిరుపతి ప్రాంతీయురాలిగా వచ్చిన పోలిడి మేరకు విచారణ చేయను ప్రత్యేక పోలీసు బృందం రంగంలోకి దిగింది.

బంగారు వ్యాపారి హత్య!

అల్లూరు రాయాజీవీధికి చెందిన బంగారు వ్యాపారి తిరువీధి లక్ష్మీనారాయణ 7వ తేది సాయంత్రం నెల్లూరు చింతారెడ్డిపాళెం సమీపంలోని కొరివి వారి కండ్రిగ వద్ద ముళ్లపొదల్లో శవమై కన్పించాడు. ఇతన్ని క్రికెట్ స్టంపులతో పొడిచి చంపడమే కాకుండా పెట్రోల్ పోసి తగులబెట్టారు. బోగోలు మండలం ఉలవపాళ్ల గ్రామస్తుడికి నెల్లూరులో బంగారు ఇప్పించను వచ్చిన లక్ష్మీనారాయణ కొరివివారి కండ్రిగలో శవమై కనిపించాడు.

న్యాయవాది రాజారామిరెడ్డి మరణం



గూడూరులో మంచి న్యాయవాదిగా పేరు గడించడంతోపాటు సంస్కృతీ సమ్మేళనం నిర్వాహకునిగా, నేత్రదాతల సంస్థ అధ్యక్షునిగా అందరికీ సుపరిచితుడైన పెల్లేటి రాజారామిరెడ్డి (77) 3వ తేది మరణించారు. ఎందరో అంధులకు చెన్నైలోని శంకర్ నేత్రాలయకు తీసుకెళ్లి కళ్లు పెట్టించిన పుణ్యజీవి రాజారామిరెడ్డి. మరణానంతరం ఆయన కళ్లు కూడా నెల్లూరు మాడరన్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. రాజారామిరెడ్డి సంతానంలో అందరూ ఉత్తములే. కుటుంబ పెద్దను కోల్పోయిన వారి కుటుంబానికి మా సానుభూతి.

జనవాణి

2వ పేజీ కొరవ

ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌ను నెల్లూరులో ఏర్పాటు చేయలేదు. ఈ రెండు వ్యవహారాల్లో జిల్లా కలెక్టర్ చొరవ చూపించమనవి.

వొమ్మిన సుబ్రహ్మణ్యం నెల్లూరు

వ్రాతకు వాత!

బ్రహ్మ లిఖితం అన్నారు. ప్రాచీన కాలం నుంచి నిన్నటి వరకు అతని చేతివ్రాత, స్పష్టంగా బ్రహ్మ వ్రాతలా ఉంటుందనేవారు. అక్షర రమ్యత తీరు తెన్నులతో తమ పిల్లల ఉన్నతిని చూసి తల్లిదండ్రులు మురిసిపోయేవారు. రోజులు మారాయి సృజనాత్మకమైన చిత్రలేఖనము చిత్రించుటలోనూ యాంత్రికమైన పద్ధతులు ముందుకొచ్చాయి. చేతులు భోజనం, కాలకృత్యాలు తీర్చుకొనేందుకే ఉపయోగపడుతున్నాయి. పలకా బలపం మాయమైపోయింది. కుర్చీల్లో కూర్చొని కంప్యూటర్ మీద నొక్కితే అక్షర మాలలు వచ్చేస్తున్నాయి. టెక్నోస్కూళ్లలో ఈ పద్ధతులు కొనసాగిపోతున్నాయి. చేతితో వ్రాసే వ్రాత పాత పడిపోవడం బాధాకరం.

వాస్తు రామచంద్ర నెల్లూరు

పదరంగం -24

నిర్వహణ : బాబాజీ

1	2			3	■	4	■	5		6
7		■	■		■		■		■	
8		9	■		■	10			■	
	■			11	12		■	■	13	■
■	■					■	■	14		
	15			16	■	■	■	17		■
18			■		■	19	■	20		21
■		■	22	■	23				■	
24	■	25				■	■	26		
27		■		■		■	28	■	■	■
	■	29			■	30				

అడ్డం

1. అనుకొన్నది జరగడం (5)
5. సమయం (3)
7. స్వప్నం (2)
8. దండోరా (3)
10. ఇంకెవ్వరు? సుయోధనుడే (3)
11. విశ్వంభర రచయిత, కవి (ముక్తసరిగా) (3)
14. సూర్యుడే (3)
15. ముక్కుతో రుచి చూడడం (4)
17. దంచడం (అసమాపకం) (2)
18. చాళుక్యుల వంశం (3)
20. కట్టడం రాయి అటు - ఇటుగా ఉంది (3)
23. పంపిణి (4)
25. లేత వయస్సు (4)
26. అటు నుంచి ఒక ఇంగ్లీషు దొర (3)
27. కామితం గలవాడు (2)
29. వక్కలు (3)
30. బ్రహ్మర్షి (5)

నిలువు

1. కష్టం, ఇబ్బంది (4)
2. పెన్ (3)
3. వినాయకుని పత్నులు క్రింద నుంచి (4)
4. అమితాబ్ బచ్చన్ ఫ్యామిలీ సాంగ్ (4)
5. తూకం వేసేది (3)
6. క్రింద నుంచి పాదం (3)
9. శివకుమారుడు (5)
12. నిల్ (2)
13. ఎండమావి (4)
14. ఆకర్షించే రాయి (5)
15. రాబడి (3)
16. దీనికి నెత్తురే ఆహారం (2)
19. అమృతము (2)
21. రెండు పదులు (3)
22. సేద్యానికి ప్రారంభోత్సవం (4)
23. సాగరం (3)
24. ఆకారం దాల్చడం (3)
28. క్రింద నుంచి ఊపిరి పీల్చడం (2)

సమాధానాలు

పదరంగం -23

1పా	శ	వి	2కం	■	3ఆ	4క	స్మి	5కం	■	6గుం
■	■	■	7చు	ర	క	త్తి	■	8కి	లా	డి
9ఆ	ట	10వి	కం	■	లి	■	11చె	■	■	గ
వా	■	ద్య	■	12వి	■	■	ము	■	13ట్రు	■
14హం	స	■	■	క	■	15బు	డు	గు	■	16న
■	■	17సం	క	ల్ప	సి	ద్ది	■	■	18పా	గ
■	19వి	■	■	ము	■	20కు	శ	ల	వు	లు
21జా	గ	ర	ణ	■	22ఆ	శ	■	■	■	■
■	త	■	■	■	23మ	ల	య	24హా	రు	25తం
26స	జీ	27వం	■	28వ	ని	త	■	రు	■	తు
29భ	వి	త	■	శం	■	■	30అ	తి	వ	■

సంక్షిప్త సింహపురి

నారాయణలో హాల్మియం లేజర్ పరికరం!



నెల్లూరు నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ యూరాలజీ విభాగంలో హాల్మియం లేజర్ పరికరం అందుబాటులో ఉందని హాస్పిటల్ మెడికల్ గ్రూప్ డైరక్టర్ డాక్టర్ జి.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ పరికరం ద్వారా మూత్రనాళం, మూత్రాశయములలోని అడ్డంకులు, కీలకమైన కిడ్నీ రాళ్లను పిండి రూపంలో చిద్రం చేస్తుంది. ఈ మలినాలను మూత్రం ద్వారా వెలుపలకు విసర్జింపజేస్తుందట. పైన పేర్కొన్న చికిత్సలు అందించే సమయంలో పేషెంటుకు ఎటువంటి గాయం కానీ, శరీరంపై కుట్టుగానీ, బాధపడేంత నొప్పిగానీ లేకుండా వైద్య చికిత్స చేయడం జరుగుతుందన్నారు. ఈ చికిత్సల అనంతరం పేషెంటు ఆసుపత్రి నుంచి ఒక రోజులోనే ఇంటికి వెళ్లిపోవచ్చని యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ సూర్యప్రకాష్ వివరించారు.

సుబ్బరామిరెడ్డి సేవాపీఠం సాయం!



రాజ్యసభ సభ్యులు తిక్కవరపు సుబ్బరామిరెడ్డి సేవాపీఠం ద్వారా నెల్లూరు మైపాడు గేటు ప్రాంతంలోని కిసాన్‌నగర్ నివాసి కుమారి లక్ష్మికి వీల్ ఛైర్ బహూకరించారు. ఈమెకు పోలియా వల్ల రెండు కాళ్ల పని చేయడం లేదు. విడతలవారీగా నెల్లూరులో వెయ్యి మందికి ఈ వీల్ ఛైర్స్ అందిస్తామని సుబ్బరామిరెడ్డి సేవాపీఠం సమన్వయకర్త దొడ్ల వరదారెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో సేవాపీఠం సభ్యులు గంగాధర్‌రెడ్డి, శ్రీరామ చంద్రారెడ్డి, సాధు మల్లిఖార్జునరావు కూడా పాల్గొన్నారు.

చెరకు రైతుల బకాయిలు చెల్లించండి!

చెరకు రైతులకు కోవూరు షుగర్ ఫ్యాక్టరీ చెల్లించాల్సిన పది కోట్ల రూపాయల పది లక్షల రూపాయలను తక్షణం యాజమాన్యం ఇచ్చేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. 2011 - 12 సంవత్సరానికి గాను కోవూరు షుగర్ ఫ్యాక్టరీకి 400 మంది రైతులు లక్ష ఎనిమిది వేల టన్నుల చెరకు తోలారట. దీనికిగాను రైతులకు 24 కోట్ల 70 లక్షల రూపాయలు ఇవ్వాల్సి ఉన్నా 11 కోట్ల 50 లక్షల రూపాయలు ఇచ్చారని మిగతాది ఇవ్వాల్సి ఉందన్నారు. చెరుకు పంట కాలం 12 నెలలు. చెరకును ఫ్యాక్టరీకి తోలి ఐదు నెలలయ్యిందని, 17 నెలలుగా పెట్టిన పెట్టుబడి కోసం రైతు ఎదురుచూడాల్సి రావడం బాధాకరమన్నారు. బకాయిల విషయమై ఫ్యాక్టరీ ఛైర్మన్ అయిన కలెక్టర్‌ను రెండు సార్లు కలిశామని ఎమ్మీనైతే లెక్కలేనన్ని సార్లు కలిసినా ప్రయోజనం లేదన్నారు. వారం లోపు బకాయిలను చెల్లించకుంటే అన్ని రైతు సంఘాలను కలుపుకొని ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తామని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గంగపట్నం రమణయ్య, పులిగండ్ల శ్రీరాములు హెచ్చరించారు.

డాక్టర్ శ్రీనివాసరాజు వితరణ!



నెల్లూరు బొల్లినేని సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో హృద్రోగ నిపుణుడు డాక్టర్ సి.ఎస్.శ్రీనివాసరాజు తన 47వ జన్మదినోత్సవాన్ని గొల్లపాళెంలోని చైల్డ్ అనాధాశ్రమంలో చేసుకొన్నారు. ఈ సందర్భంగా అక్కడే కేక్ కట్‌చేసి పిల్లలకు పంచి పెట్టడంతోపాటు వారితో కలసి ఉపాహారం తిన్నారు. ఆశ్రమంలోని పిల్లలు కూర్చునేందుకు కుర్చీలు ఈ సందర్భంగా విరాళంగా ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సర్వీసు ఆర్గనైజేషన్ అధ్యక్షుడు టి.కృష్ణారెడ్డి, చైల్డ్ ఆశ్రమం నిర్వాహకుడు శరత్‌చంద్ర కూడా పాల్గొన్నారు.

ఎన్.ఎం.డి. చారిటబుల్ ట్రస్ట్!



నెల్లూరు జెండావీధి యువకుడు సయ్యద్ నిజాముద్దీన్ ఏర్పాటుచేసిన ఎన్.ఎం.డి చారిటబుల్ ట్రస్ట్‌ను ఎఎస్పీ నాగేశ్వరరావు, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ మాశిలామణి, పిఎన్ఎం హైస్కూల్‌లో ఇటీవల ప్రారంభించారు. వన్‌టౌన్ ప్రాంతంలోని సందుల్లోకి అత్యవసర సమయాల్లో ఆటోల వంటివి కూడా పోలేని పరిస్థితుల్లో పలువురు ప్రాణాలు విడుస్తున్నారని, తన తల్లి ఈ విధంగా చనిపోయినందున ఆమె స్మృతిగా ఉచితంగా అంబులెన్స్ ఈ ప్రాంతంలో అందుబాటులో ఉంటుందన్నారు. ప్రతి ఆదివారం ట్రస్ట్ నేతృత్వంలో పిఎన్ఎం స్కూల్‌లోనే ఒక స్పెషలిస్ట్ లేదా సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్లచే ఉచిత వైద్య పరీక్షలు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ మెడికల్ కాలేజి సూపరింటెండెంట్ వీరప్రసాద్ కూడా పాల్గొన్నారు.



రైతు లోకం

బెండసాగులో యాజమాన్య పద్ధతులు!

మార్కెట్లో బెండకాయలకు ధర ఎప్పుడూ నిలకడగా వుంటుంది. దీంతో ఎక్కువ మంది రైతులు బెండసాగు వైపు మొగ్గు చూపుతుంటారు. ఆసక్తిగల రైతులకు ఉద్యానవన శాఖాధికారులు సాగులో చేపట్టాల్సిన పద్ధతులు, తెగుళ్ల నివారణకు సంబంధించిన విషయాలను తెలియజేస్తున్నారు.

రకాల ఎంపిక: ప్రధానంగా పల్లాకు తెగులును తట్టుకొనే సంకర రకాలను ఎంచుకోవాలి. సాధారణ రకాలలో అర్క అనామిక పల్లాకు తెగులును తట్టుకుంటుంది. అర్క అభయ కూడా పల్లాకు తెగులును తట్టుకుంటుంది. పర్బని క్రాంతి రకం మహారాష్ట్రలోని పర్బని నుంచి విడుదల చేశారు. దీని పంట కాలం 120 రోజులు.

సంకర రకాలు: వర్ష విశాత, నాద్ శోభి, ప్రియ, సుప్రియ, మహికో-10, 55, 64, యుఎస్-7109 రకాలు అనువైనవి. ఖరీఫ్ పంటను జూలై నెలలోపు విత్తుకోవచ్చు. కిలో విత్తనాలకు 5 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్ లేదా 8 గ్రాముల ట్రయికోడెర్మా పట్టించి విత్తుకోవాలి. ఇలా చేయడం వల్ల రసం పీల్చే పురుగులను, ఎండు తెగులును అదుపులో వుంచవచ్చు. విత్తనాలు ఎకరానికి 6 కిలోలు అవసరం అవుతాయి. సంకర రకాలైతే 2.5 కిలోలు కావాలి. బెండ సాగుకు బాగా నీరు ఇంకే సారవంతమైన, తేలికపాటి నేలలు, మురుగు నీరు వెళ్లే సౌకర్యం వున్న నల్ల నేలలు అనుకూలం.

విత్తు పద్ధతి: నేలలో ఎకరానికి 10 టన్నులు బాగా మాగిన పశువుల ఎరువు లేదా ఒక టన్ను వానపాముల ఎరువును (వర్మి కంపోస్టు) వేసి నాలుగు సార్లు దున్నాలి. విత్తిన వెంటనే నీరు పెట్టాలి. మరల 4-5 రోజులకు రెండో తడి పెట్టాలి. పాదుకు ఒక మొక్క వుంచి మిగిలిన వాటిని తీసి వేయాలి.

ఎరువుల యాజమాన్యం: ఒక ఎకరానికి పశువుల ఎరువు 10 టన్నులు, 24 కిలోల భాస్వరం, 16 కిలోల పొటాష్ నిచ్చే ఎరువులను ఆఖరి దుక్కిలో వేయాలి. 48 కిలోల నత్రజని నిచ్చే ఎరువును మూడు సమాన భాగాలుగా చేసి 1/3 వంతు ఆఖరి దుక్కిలో, మిగిలిన 2/3 ఎరువు రెండు భాగాలుగా చేసి విత్తిన 30వ రోజు, 45వ రోజు వేయాలి. సంకర జాతి రకాలకు ఎరువులను 50శాతం పెంచాలి. విత్తిన మరుసటి రోజు ఉదయాన్నే 200 లీటర్ల నీటిలో 1.5 లీటర్ల పెండిమిథాలిన్ కలిపి ఎకరం తడినేలపై పిచికారి చేస్తే నెల రోజుల పాటు కలుపు అదుపులో వుంటుంది. ఉద్యానవనశాఖ అధికారులు సూచించిన విధంగా బెండసాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చు.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/12-14

మెత్తబడ్డ జగన్!

మొదటి పేజీ కొరవ

మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ చంచల్‌గూడ జైలుకు వెళ్లి వచ్చాడు. ఆసమయంలో ఇద్దరి మధ్య నడిచిన సంభాషణ రాజీ ప్రయత్నాలకు నాంది పలికిందని తెలుస్తున్నది. ఢిల్లీ పెద్దలతో పోరాడి సాధించేది ఏదీ లేదని ఒవైసీ గట్టిగా చెప్పాడట. లల్లూప్రసాద్ యాదవ్, మాయావతి, ములాయం సింగ్, శరద్ పవార్ వంటి నేతలే తమ అభిజాత్యాన్ని పక్కనపెట్టి కాంగ్రెస్‌తో ఏదో ఒక రూపంలో సయోధ్య పాటిస్తున్నప్పుడు, నువ్వొక్కడివి చేయగల్గింది ఏదీ లేదని నచ్చచెప్పాడట. దానికి జగన్ సానుకూల స్పందనకు సూచన – వెనువెంటనే వైఎస్.విజయమ్మ ఢిల్లీ పర్యటన. అక్కడ కూడా ఆమెకు శరద్ పవార్ వంటివారు సయోధ్యనే ప్రతిపాదించారని వినికిడి.

అయితే ఈ దశలో కాంగ్రెస్‌తో సయోధ్య వల్ల జగన్‌కు కలిగే లబ్ధి ఏమిటన్నది ప్రశ్న. రాష్ట్ర ప్రజానీకం ఆయన్ను భవిష్యత్తు ముఖ్యమంత్రిగా చూస్తున్నది. చరిత్రలో ఎవరికీ దక్కని జనాదరణ లభిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యామ్నాయంగా జగన్‌ను చూస్తున్నారు ప్రజలు. అటువంటప్పుడు కాంగ్రెస్‌తో కలిసి పోవడం వల్ల ఆయనకు లాభం కంటే నష్టం ఎక్కువ. మొదటగా స్వతంత్ర్యం పోతుంది. పార్టీలోని శతకోటి లింగాలలో ఒక బోడి లింగంగా తప్ప స్వంత వ్యక్తిత్వం వుండదు. ముఖ్యమంత్రి పదవికి కూడా సోనియాగాంధీ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాలి.

అయితే ఇప్పుడు జగన్ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య – అక్రమ ఆస్తుల కేసు. సిబిఐ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ ఇప్పటికే ఆ కేసులను బలంగా బిగించాడని వినికిడి. ఇంతవరకు కోర్టులో ఆయన దాఖలు చేసిన ఛార్జిషీట్లు నామమాత్రమైనవి. వాటిలో పెద్దగా పస లేదు. అసలు కేసులు ముందున్నాయి. కలకత్తా కంపెనీలు, హవాలా లావాదేవీలు, మారిషస్ నగదు బదలీలు, వందల కోట్ల విలువ చేసే భూరి భవంతులు, విదేశాలలో జరిపిన లెక్కలేనన్ని లావాదేవీలను సిబిఐ అధికారులు సాక్ష్యంగా నిరూపించడానికి సిద్ధంగా వున్నారని వినికిడి. అదే జరిగితే, జగన్ మెడ చుట్టూ చట్టం ఉచ్చు బిగిసి పోతుంది. వీటిలో ఏ ఒక్క కేసులో శిక్ష పడినా రాజకీయ జీవితం భస్మమైపోతుంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం క్రిమినల్ కేసులలో రెండేళ్లకు పైబడి శిక్ష పడితే, ఎన్నికలలో పోటీ చేయడానికి శాశ్వతంగా అనర్హుడౌతాడు. జైలులో వున్నా ఆయన పార్టీ గెలుస్తుందన్నది వాదనకు చెప్పే మాట మాత్రమే. జగన్‌కు కావల్సింది తాను ముఖ్యమంత్రి కావడమే తప్ప, తన తల్లో చెల్లెలో గద్దె ఎక్కడం కాదు. ఏ ముఖ్యమంత్రి పదవి కోసం కాంగ్రెస్ అధిష్టానంతో ఢీకొట్టి, రెండేళ్లుగా తిండి నిద్ర లేకుండా పోరాటం చేస్తున్నాడో అదే దక్కని పరిస్థితి ఏర్పడుతున్నదిప్పుడు. అందువల్లనే కాంగ్రెస్‌తో రాజీకి జగన్ సిద్ధపడుతున్నాడనే వదంతులు వ్యాప్తిలోకి వస్తున్నాయి.

ఇందుకు రాష్ట్రపతి ఎన్నిక ఒక సూచన మాత్రమే. నిజానికి ఈ ఎన్నికలో కాంగ్రెస్‌ను సమర్థించడం తప్ప వేరే గత్యంతరం జగన్‌కు లేదు. ప్రత్యర్థి అభ్యర్థి పిఎ.సంగ్మా బిజెపి మద్దతు తీసుకొంటున్నాడు. రాష్ట్రంలో జగన్‌ను మనస్ఫూర్తిగా అక్కున చేర్చుకొన్న వర్గాలలో మైనార్టీలు ప్రధానమైనవి. సంగ్మా కోసం లక్షలాది ఓట్ల పంట పండించే ముస్లింలను దూరం చేసుకొనే అవివేకి కాదు జగన్. అందువల్ల కాంగ్రెస్‌కు మద్దతు పలకడం తప్ప ఆయనకు వేరే మార్గం లేదు. పైగా కాంగ్రెస్‌తో తన వైరం రాష్ట్రానికి మాత్రమే పరిమితమని, కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ కూటమితో కలిసి పని చేయడానికి తనకు అభ్యంతరాలు లేవని స్పష్టంగా ప్రకటన చేసి వున్నాడు. అందువల్ల రాష్ట్రపతి ఎన్నికలో ఆ నిర్ణయం తీసుకొన్నాడు జగన్. అయితే దీనికి ప్రత్యుపకారంగా అక్రమ ఆస్తుల కేసుల నుంచి జగన్‌ను విముక్తి చేసేందుకు కాంగ్రెస్ పెద్దలు తమ సహకారం అందించాలన్నది రాజీ ప్రతిపాదన అంటున్నారు. అందులో ఎంత నిజం వుందో, ఎంత వూహ వుందో సిబిఐ దాఖలు చేసే తదుపరి ఛార్జిషీట్లను బట్టి తేలిపోతుంది.







Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore. E-mail : jaminryot@yahoo.com